1st Happy Work Anniversary. Year

షణ్ముఖ SHANMUKHAVELUGU
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు తెలుగు దినపత్రిక

RNI : APTEL / 2023 / 89152

Good for Health
Best for Readers
THE POWER OF PEN RK

సంపుటి : 03 సంచిక : 168 గురువారం 25 జూన్ 2026 పేజీలు 8 వెల : రూ.3

Printed by Ongole. Published From Ongle, Nellore, Guntur, Markapur, Bapatla.

## ఉక్రెయిన్‌లోకి భారత్ దళాలు.. వాన్స్ ప్రతిపాదనను కొట్టేసిన ట్రంప్



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, జూన్ 24)

అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ రెండోసారి బాధ్యతలు చేపట్టిన వెంటనే ఉక్రెయిన్-రష్యా యుద్ధాన్ని ముగించేందుకు విస్తృత ప్రయత్నాలు చేశారు. ఇందుకోసం అగ్రరాజ్య సర్కారు అనేక ప్రతిపాదనలు రూపొందించింది. ఒక దశలో భారత బలగాలను కదనరంగంలోకి శాంతిదూతలుగా పంపించాలని ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ సూచించారు. అయితే, దీన్ని ట్రంప్ కొట్టిపారేశారు. తాజాగా విడుదలైన ఓ పుస్తకంతో ఈ కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. 'రెజీమ్ ఛేంజ్' పేరుతో ప్రముఖ రచయితలు మ్యాగీ హాబర్‌మాన్, జొనాథన్ స్వాన్ రాసిన పుస్తకం జూన్ 23న విడుదలైంది. ఇందులో ఉక్రెయిన్-రష్యా యుద్ధం ముగింపు కోసం అమెరికా సర్కారు చేసిన ప్రయత్నాలను ప్రస్తావించారు. ఆ పుస్తకం ప్రకారం..అగ్రరాజ్య అధ్యక్షుడిగా రెండోసారి ట్రంప్ ప్రమాణస్వీకారం చేసిన పది రోజుల తర్వాత ఓవల్ ఆఫీసులో కీలక సమావేశం జరిగింది. ఆ భేటీలో ఉక్రెయిన్-రష్యాకు ప్రత్యేక రాయబారిగా ఉన్న రిటైర్డ్ ఆర్మీ లెఫ్టినెంట్ జనరల్ కీత్ కెలాగ్.. ▶మిగతా 2లో



# ఆంధ్రప్రదేశ్‌కు.. గోల్డెన్‌డేస్



- కర్నూలు జిల్లా జొన్నగిరిలో దేశంలోనే అతిపెద్ద ప్రైవేట్ గోల్డ్ మైనింగ్ ప్రాజెక్ట్ ప్రారంభం
- జొన్నగిరి పేరును 'స్వర్ణగిరి'గా మారుస్తున్నట్లు ప్రకటించిన సీఎం చంద్రబాబు
- రాబోయే రోజుల్లో స్వర్ణగిరి గోల్డ్ ఫీల్డ్ 5000 మందికి ఉద్యోగాలు కల్పిస్తుందని హామీ
- రాయలసీమను 'రత్నాల సీమ'గా మార్చడమే లక్ష్యమన్న ముఖ్యమంత్రి
- గత ప్రభుత్వంపై, గొడ్డలి పార్టీపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించిన చంద్రబాబు

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 24)

గోల్డ్ మైనింగ్‌తో జొన్నగిరిలో పూర్వ వైభవానికి శ్రీకారం చుట్టామని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. కర్నూలు జిల్లా తుగ్గలి మండలం జొన్నగిరిలో బంగారం శుద్ధి కర్మాగారాన్ని సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

## కడప ఉక్కుకు 3న శంకుస్థాపన

- ఆతిథ్యరంగంలో భారీగా పెట్టుబడులు
- హోమ్‌స్టేల రిజిస్ట్రేషన్ సరళీకరణ
- వెల్లడించిన మంత్రి పార్ధసారథి



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 24)

కడప ఉక్కు పరిశ్రమకు వచ్చేనెల 3న శంకుస్థాపన చేయనున్నట్లు సమాచార, పౌరసంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. రెండేళ్లలో దీన్ని పూర్తి 2

## కిరాణ కొట్టు నుంచి డేటా సెంటర్ వరకు.. సింగిల్ పోర్టల్‌తో అనుమతులు



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 24)

కిరాణ కొట్టు నుంచి డేటా సెంటర్ వరకు సింగిల్ పోర్టల్ ద్వారా అనుమతులు మంజూరు చేసే విధానాన్ని రూపొందించాలని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాల కల్పనకు మంత్రి లోకేశ్ నేతృత్వంలో ఏర్పాటైన మంత్రుల బృందం సమావేశం ఉండవల్లి నివాసంలో నిర్వహించారు. మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, కందుల దుర్గేశ్, టీజీ భరత్ హాజరయ్యారు. లోకేశ్ మాట్లాడుతూ.. 'రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చిన 750 భారీ పరిశ్రమలు వివిధ దశల్లో ఉన్నాయి. ఇవి పూర్తి స్థాయిలో పట్టాలెక్కితే పెద్ద ఎత్తున రాష్ట్రంలోని యువతకు ఉద్యోగాలు అందుబాటులోకి వస్తాయి. త్వరగా ఆయా పరిశ్రమలు గ్రౌండింగ్ అయ్యేలా పరిశ్రమల శాఖ, ఎకనమిక్ డెవలప్‌మెంట్ బోర్డు అధికారులు ట్రాక్ చేస్తూ శ్రద్ధ వహించాలి. పనులను వేగవంతం చేసి, ప్రతినెలా ప్రాజెక్టుల భూమిపూజ, ప్రారంభోత్సవాలు ఉండేలా అధికారులు చొరవచూపాలి' అని సూచించారు.

**15 రోజులకోసారి సమీక్షించాలి :** "నవంబరులో నిర్వహించే భాగస్వామ్య సదస్సు నాటికి సాధ్యమైనంత గరిష్ఠంగా పరిశ్రమలు గ్రౌండింగ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలి. గత సమిట్‌కు మించి ఈసారి పెద్ద సంఖ్యలో రాష్ట్రానికి పరిశ్రమలను ఆకర్షించేలా విదేశాలతో పాటు దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున రోడ్ షోల నిర్వహణకు ప్రణాళికలు రూపొందించాలి. ప్రాజెక్టుల పురోగతికి సంబంధించి ప్రతి 15 రోజులకోసారి కలెక్టర్లు, జిల్లా స్థాయి అధికారులతో రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులు సమీక్షించాలి. వివిధ శాఖ అధికారులు ▶మిగతా 2లో

## పవన్ కల్యాణ్‌ను వైకాపా విమర్శిస్తుంటే స్పందించరేం?



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 24)

నేరస్థులను ప్రోత్సహించడం, వారికి వంతపాడటం వైకాపా నైజమని, అందుకే ఆ పార్టీలో ఎక్కువ మంది రౌడీషీటర్లు, సంఘ వ్యతిరేక శక్తులు ఉన్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్వజమెత్తారు. ఇప్పుడు కులాల మధ్య చిచ్చు పెట్టి సమాజంలో చీలికలు తెచ్చేందుకు కుట్రలు చేస్తోందని మండిపడ్డారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ లక్ష్యంగా వైకాపా విమర్శలు చేస్తున్నప్పుడు మంత్రులంతా ఎందుకు స్పందించలేని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వం, పార్టీ నుంచి ఆదేశాలు వస్తాయని ఎదురుచూడొద్దని.. కూటమిలోని ఎవరిపై విపక్షాలు విమర్శలు, ఆరోపణలు చేసినా అంతా సంఘటితంగా ▶మిగతా 2లో

## ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఐక్య ఉద్యమాలు



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 24)

ఏపీ ఐకాస అమరావతి తలపెట్టిన ఉద్యమ కార్యాచరణకు ఉద్యోగులను సమాయత్తపరచడానికి ఉమ్మడి జిల్లాల వేదికగా ఉద్యమ సన్నద్ధత సభలు నిర్వహించనున్నట్లు ఐకాస ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి వలిశెట్టి దామోదరరావు తెలిపారు. మంగళవారం విజయవాడలో ఏపీ ఐకాస అమరావతి ఆధ్వర్యంలో ఐకాసకు అనుబంధంగా ఉన్న వివిధ శాఖల ఉద్యోగ సంఘాల రాష్ట్ర, జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో కీలక సమావేశం నిర్వహించారు. ఉద్యోగుల ఆకాంక్షలకు అనుగుణంగా ఐక్య ఉద్యమ కార్యాచరణకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. జులై 12న శ్రీకాకుళంలో, 21న అనంతపురం, ఏలూరు, గుంటూరులో సన్నద్ధత సభలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అన్ని డిపార్ట్‌మెంట్ల సంఘాలు జులై 10లోగా రాష్ట్ర కార్యవర్గ సమావేశాలు నిర్వహించాలని సూచించారు. ఐకాస పోరాట కమిటీ ఛైర్మన్ టి.వి.ఫణిపేర్రాజు, కోశాధికారి తిమ్మసర్తి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో జనసేన జోరు...

- భారీ చేరికల కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసిన పవన్ కల్యాణ్
- తెలంగాణపై ఫుల్ ఫోకస్ పెట్టిన పవన్ కల్యాణ్
- తెలంగాణ జాయినింగ్స్ కమిటీ ఏర్పాటు
- క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యం



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 24)

ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వంలో అత్యంత కీలక భాగస్వామిగా ఉన్న జనసేన పార్టీ ఇప్పుడు పొరుగు రాష్ట్రమైన తెలంగాణపై తన ఫోకస్ పెంచింది. తెలంగాణలో పార్టీ ఉనికిని చాటడమే కాకుండా, క్షేత్రస్థాయిలో కేడర్‌ను బలోపేతం చేసేందుకు జనసేనాని, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కార్యాచరణ మొదలుపెట్టారు.

రాష్ట్రంలో పార్టీ కార్యకలాపాలను క్రమబద్ధీకరించడానికి, ఇతర పార్టీల నుండి వచ్చే వలసలను సమన్వయం చేయడానికి ఏడుగురు సభ్యులతో కూడిన 'తెలంగాణ జాయినింగ్స్ కమిటీ'ని అధికారికంగా నియమించారు. పార్టీ భావజాలానికి ఆకర్షితులవుతున్న విద్యావంతులు, సామాజికవేత్తలు, రిటైర్డ్ ఐఏఎస్/ఐపీఎస్ అధికారులు, తటస్థులను లైన్‌లోకి తెచ్చే బాధ్యతను ఈ ఏడుగురు సభ్యులకు అప్పగించారు.

## నేషనల్ హైవేనా.. పార్కింగ్ ఏరియానా?



(షణ్ముఖ వెలుగు, విజయవాడ,జూన్ 24)

విజయవాడ దుర్గగుడికి వెళ్లే భక్తులు.. ఆలయ ఘాట్‌రోడ్డు ముందు నుంచి వెళ్లే ఎన్‌హెచ్-65పై కార్లను ఇలా నిలిపివేస్తున్నారు. పైగా ఈ కార్లకు ఆలయానికి చెందిన ప్రైవేటు గుత్తేదారు పార్కింగ్ ఫీజునూ వసూలు చేస్తున్నారు. అసలు ఇది పార్కింగ్ ఏరియానే కాదని భక్తులు ప్రశ్నిస్తుంటే, 'డబ్బులు కడితేనే రోడ్డు పక్కన వాహనం ఆపండి.. లేదంటే ఇక్కడి నుంచి వెళ్లిపోండి' అని గుత్తేదారు అనుచరులు వారితో గొడవలకు దిగుతున్నారు. అక్రమ పార్కింగ్‌తో ఈ మార్గంలో ట్రాఫిక్‌కు ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

# తలార్లపల్లిలో వైభవంగా గంగమ్మ తల్లి కొలుపులు

## పాల్గొన్న మార్కెట్ యార్డ్ చైర్మన్ మీసాల మురళీకృష్ణ



(షణ్ముఖ వెలుగు, నూజివీడు, జూన్ 24)

మండల పరిధిలోని తలార్లపల్లి గ్రామంలో కొలకలూరి వారి ఆధ్వర్యంలో జరుగుతున్న గంగమ్మ తల్లి కొలుపుల వేడుకలు అత్యంత వైభవంగా సాగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా వినుకొండ మార్కెట్ యార్డ్ చైర్మన్ మీసాల మురళీకృష్ణ యాదవ్ గ్రామాన్ని సందర్శించి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కొలకలూరి వంశస్థులు, గ్రామస్తులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబించే ఇలాంటి ఉత్సవాల వల్ల గ్రామాల్లో భక్తిభావం, ఐక్యమత్యం పెరుగుతాయని, గంగమ్మ తల్లి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కొలకలూరి కుటుంబ సభ్యులు రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ మోతడక వీరాచారి, జక్కిరెడ్డి అబ్బిరెడ్డి, ఆళ్ల గురువారెడ్డి, యేసు రత్నం, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# సర్ నిర్వహణలో నిబంధనలు ఉల్లంఘించరాదు

## కేంద్ర ఎన్నికల డిప్యూటీ కమిషనర్ ఏటూరి భాను ప్రకాష్



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జూన్ 24)

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ (సర్) నిర్వహణలో నిబంధనలు ఉల్లంఘించరాదని కేంద్ర ఎన్నికల డిప్యూటీ కమిషనర్ ఏటూరి భాను ప్రకాష్ చెప్పారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్, కేంద్ర ఎన్నికల కమిషన్ కార్యదర్శి నవీన్ కుమార్‌లతో కలిసి బుధవారం ఆయన ఒంగోలు వచ్చారు. జిల్లాలో ' సర్ ' ప్రక్రియలో పురోగతి పై కలెక్టర్ పి రాజాబాబు, జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారిలతో కలిసి ప్రకాశం భవనంలో వీరు ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, డిజిటైజేషన్ చేస్తున్న తీరు, పురోగతిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా భాను ప్రకాష్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిర్దేశించిన ప్రకారమే ఈ ప్రక్రియ జరగాలన్నారు. క్షేత్రస్థాయిలో బిఎల్ఓ లు సమర్థంగా పనిచేస్తేనే పారదర్శకమైన ఓటర్ల జాబితా సాధ్యమవుతుందన్నారు. ఈ దిశగా ఈఆర్వోలు తమ పరిధిలోని ఏఈఆర్వోలు, సూపర్వైజర్లు, బిఎల్ఓ లతో నిత్యం సంభాషిస్తూ పురోగతిని గమనిస్తూ ఉండాలని ఆయన చెప్పారు. క్షేత్రస్థాయి సిబ్బంది రోజులో కనీసం ఐదు గంటలు ఫీల్డ్ లో ఉండాలని డిప్యూటీ కమిషనర్ స్పష్టం చేశారు. అప్పుడే క్షేత్రస్థాయిలోని వాస్తవ పరిస్థితులు తెలుస్తాయన్నారు. కేవలం ' సర్ ' మాత్రమే కాకుండా పోలింగ్ కేంద్రాల మార్పిడి, వాటి పరిధిలో మార్పు కోరుకుంటున్న ఓటర్ల వంటి విషయాలు ఇప్పుడు గమనిస్తేనే ఎన్నికల సమయంలో ఇబ్బందులు లేకుండా చేయవచ్చు అన్నారు. జిల్లాలోని పరిస్థితిని కలెక్టర్ ఈ సందర్భంగా వివరించారు. రాజకీయ పార్టీలు కూడా వాటి తరఫున బిఎల్ఏలను అందుబాటులో ఉంచుతున్నట్లు చెప్పారు. మొత్తంగా చూస్తే జిల్లాలో ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ సగటున 80 శాతం వరకు ఉందని, డిజిటైజేషన్ ప్రక్రియలో కూడా పురోగతి ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అర్హులైన ఓటర్లు అందరూ జాబితాలో ఉండేలా చూస్తున్నామన్నారు. ' సర్ ' జరుగుతున్నది కాబట్టి ఎవరిదైనా ఓటు లేకపోతే ఫారం-6 నింపడం ద్వారా నమోదు చేసుకోవచ్చని అవగాహన కల్పించామన్నారు. ఈ సమావేశంలో సబ్ కలెక్టర్ డి హిమ వంశీ, డిఆర్ఓ మాధురి, అన్ని నియోజకవర్గాల ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, బీఎల్వోలు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

# ఆంధ్రప్రదేశ్‌కు..గోల్డెన్‌డేస్

"రాయలసీమను రతనాల సీమగా మార్చడం జొన్నగిరి నుంచే ప్రారంభమవుతుంది. ఈ ప్రాంతాన్ని గతంలో సువర్ణగిరి అని పిలిచేవారు. అశోకుడి నాలుగో రాజధాని ఇది. జొన్నగిరిని సువర్ణగిరిగా మార్చుకుందామా? వందల ఏళ్ల క్రితమే ఈ ప్రాంతం బంగారం, రత్నాలతో నిండింది. అశోకుడి శాసనాలు ఈ ప్రాంత వైభవాన్ని చాటి చెబుతున్నాయి. సాగునీటి ప్రాజెక్టులు పూర్తిచేసి సీమను కాపాడాలనే ఆలోచన చేసిన వ్యక్తి ఎన్టీఆర్. ఆయన నిర్ణయంతో రాయలసీమ ప్రాంతానికి ప్రాణం పోశాం. ఒకప్పుడు కేజీఎఫ్ గురించి దేశవ్యాప్తంగా చర్చ జరిగేది. ఇప్పుడు దేశవ్యాప్తంగా జొన్నగిరి గురించి చర్చ జరుగుతుంది. చమురు తర్వాత దిగుమతికి అధికంగా విదేశీ మారక ద్రవ్యం వాడేది బంగారానికే. ఇక్కడ ఏడాదికి టన్ను బంగారం ఉత్పత్తి అవుతుంది. ఇప్పటికి 400 కిలోల సామర్థ్యంతో ప్రారంభమైంది. భవిష్యత్తులో వెయ్యి కిలోలకు చేరుతుంది. ఇప్పటికే 800 ఉద్యోగాలు వచ్చాయి. త్వరలో 1500 మందికి ఉపాధి కల్పిస్తాం. భవిష్యత్తులో 5వేల మందికి ఈ గోల్డ్ మైన్స్‌లో ఉపాధి దొరుకుతుంది. జొన్నగిరి రాష్ట్రానికి ఆదర్శంగా తయారవుతుంది. ఈ ప్రాంతానికి గ్రోత్ ఇంజిన్‌గా మారుతుంది. ఇక్కడ నగల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నా. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు ఆంధ్రప్రదేశ్ చిరునామాగా మారింది. రాయలసీమకు ఇన్ని పరిశ్రమలు వస్తాయని అనుకున్నారా?దేశంలోనే అతిపెద్ద డ్రోన్ సిటీ కర్నూలులో వస్తోంది. వీలైనంత త్వరగా కర్నూలుకు హైకోర్టు బెంచ్ తీసుకొస్తాం. 2028 నాటికి రాయలసీమలో స్టీల్ ప్లాంట్ ప్రారంభిస్తాం.

**నేరాలు చేయడంలో గొడ్డలి పార్టీ నేతలు సమర్థులు**

2019–24 మధ్య రాష్ట్రంలో విధ్వంస పాలన నడిచింది. వేంకటేశ్వరస్వామికి అపచారం జరిగితే శిక్షించాలా..లేదా? స్వామివారి ప్రసాదంలో కల్తీ నెయ్యి కలిపారు. ఇప్పుడు దేవుడి దగ్గరకు వెళ్లి దండాలు పెడుతున్నారు. దేవుడిని నమ్మే ఏ వ్యక్తి కూడా వాళ్లను క్షమించడు. ప్రజలకు ఏవిధంగా మంచి చేయాలనేదే నా ఆలోచన. గొడ్డలి పార్టీ విషాన్ని చిమ్ముతోంది. నేరాలు చేయడంలో ఆ పార్టీ నేతలు సమర్థులు. సాయికృష్ణ ఘటనకు కూడా కులం రంగు పులిమారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌పై నోరుపారేసుకుంటున్నారు. అలాంటి వారి నోరు మూయించే శక్తి మాకుంది. మెగా డీఎస్సీ పూర్తయిన ఏడాది తర్వాత పేపర్ లీకైందని ఆరోపణలు చేస్తున్నారు. దీనిపై చర్చకు రమ్మని మంత్రి లోకేశ్ సవాల్ విసిరితే రాలేదు. ఎన్నికల్లో హామీ ఇవ్వకపోయినా దాదాపు 11వేల మంది ఉద్యోగులను సీపీఎస్ నుంచి ఓపీఎస్‌కు తీసుకొచ్చి వారి జీవితాల్లో వెలుగులు నింపాం" అని చంద్రబాబు అన్నారు.

# కడప ఉక్కుకు 3న శంకుస్థాపన

చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. ప్రకాశం జిల్లాలోనూ స్టీల్ బెనిఫిషియేషన్ ప్లాంట్ రాబోతుందని, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ.1,230 కోట్లు పెట్టుబడితో దీన్ని ఏర్పాటు చేయనుందని వెల్లడించారు. అమరావతి, విశాఖ, తిరుపతి నగరాల్లో ఆతిథ్యరంగంలో పెద్ద ఎత్తున పెట్టుబడులు వచ్చినట్లు తెలిపారు. సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన మంత్రివర్గ సమావేశం వివరాలను ఆయన విలేకరుల సమావేశంలో వెల్లడించారు.

# కిరాణ కొట్టు నుంచి డేటా సెంటర్ వరకు.. సింగిల్ పోర్టల్‌తో అనుమతులు

సమన్వయంతో పని చేసి, మౌలికసదుపాయాల కల్పనపై దృష్టిసారించాలి. పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలి. భారీ పరిశ్రమలతో పాటు రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటవుతున్న ఎంఎస్ఎంఈలను ఆన్‌బోర్డు చేయాలి. త్వరలో భోగాపురం విమానాశ్రయం అందుబాటులోకి రానున్నందున విశాఖపట్నంలో సాధ్యమైనంత ఎక్కువగా హోటల్ గదులు అందుబాటులోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలి' అని సూచించారు.

**స్లరీ పైప్‌లైన్‌పై అధ్యయనం చేయండి**

వేగం, స్థిరత్వం, సర్వీస్ మన ప్రభుత్వ ప్రత్యేకతలు. సులభతరమైన సర్వీస్ డెలివరీ అందించాలి. ఎంప్లాయిమెంట్ లింక్డ్ ఇన్సెంటివ్స్ అందించే అంశాన్ని పరిశీలించాలి. ఇప్పటికే రాష్ట్రంలో ఉన్న టెక్స్‌టైల్ పరిశ్రమలు క్యాప్టివ్ పవర్ ఉత్పత్తి చేసుకునేందుకు ఏడాది పాటు బ్యాంకింగ్ ఫెసిలిటీ ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తాం. అనకాపల్లి-విశాఖ- విజయనగరం జిల్లాలు ఉక్కు హబ్‌గా ఏర్పడుతున్నందున కొత్తగా రాష్ట్రానికి వచ్చేందుకు మరికొన్ని ఉక్కు పరిశ్రమలు ఆసక్తి చూపుతున్నాయి. ఇందులో ప్రధానమైన ముడిసరకు సరఫరా కోసం స్లరీ పైప్ లైన్ కావాలని ఆయా సంస్థలు కోరుతున్నాయి. దీనిపై అధికారులు అధ్యయనం చేయాలి' అని అన్నారు. రాష్ట్రంలో గార్మెంట్ పరిశ్రమలను ఆకర్షించడానికి చేపట్టాల్సిన చర్యలు, అందించాల్సిన ప్రోత్సాహకాలపై సమావేశంలో చర్చించారు.

# పవన్ కల్యాణ్‌ను వైకాపా విమర్శిస్తుంటే స్పందించరేం?

స్పందించాలని సీఎం సూచించారు. మంగళవారం మంత్రివర్గ సమావేశంలో ఎజెండా అంశాలపై చర్చ ముగిశాక... రాష్ట్రంలో ఇటీవల చోటు చేసుకున్న వివిధ పరిణామాలు, వైకాపా చేస్తున్న విధ్వంసకర కుల రాజకీయాలపై చర్చ జరిగింది. సీఎం మాట్లాడుతూ.. 'విజయవాడకు చెందిన గాదె సాయికృష్ణ అదృశ్యం కేసులోనూ కులాన్ని తెరపైకి తెచ్చి చిచ్చు పెట్టేందుకు కుట్ర చేస్తున్నారు. సాయికృష్ణ కేసులో ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరిస్తోంది. సీఐ నాగరాజును సస్పెండ్ చేశాం. అరెస్ట్ కూడా చేశాం. లోతైన దర్యాప్తు కోసం సిట్ వేశాం. ఈ చర్యలపై అతని తల్లే సంతృప్తి వ్యక్తం చేశారు. వైకాపా వాళ్లు మాత్రం కావాలని రచ్చ చేస్తున్నారు. ఒక రాజకీయ పార్టీ ఊరూరా కుల సమావేశాలు నిర్వహించడం ఏం సంస్కృతి? అయినా నేరం చేసినవాడికి కులమేంటి? సీఐ నాగరాజుకు అభిమానులుండి, వాళ్లేదో ర్యాలీలు చేస్తే అవీ ప్రభుత్వమే చేయిస్తోందంటూ వైకాపా బురద జల్లాలని చూస్తోంది' అని మండిపడ్డారు.

**విమర్శలపై సత్వరమే స్పందించండి**

'కాపు నాయకుల్ని ముందుపెట్టి పవన్ కల్యాణ్‌పై వైకాపా కావాలనే విమర్శలు చేస్తోంది. సాయికృష్ణ కేసులో ఆయనను కావాలనే వైకాపా వివాదంలోకి లాగుతున్నప్పుడు మంత్రులు స్పందించకుండా, ఎవరికివాళ్లు మాకెందుకులే అనుకుంటే ఎలా? వైకాపా అసత్య ప్రచారం చేస్తున్నప్పుడు మీరు వెంటనే స్పందించి ప్రజలకు వాస్తవాలు చెప్పాలి కదా! కూటమి నాయకులు ఎవరిపై ప్రతిపక్షాలు విమర్శలు చేసినా, కించపరిచేలా మాట్లాడినా, దుష్ప్రచారం చేసినా మంత్రులందరూ స్పందించాల్సిందే. రాజకీయంగా తిప్పి కొట్టాల్సిందే' అని చంద్రబాబు స్పష్టం చేశారు.

**నేరస్థులకు వంత పాడటం వైకాపా నైజం**

'కర్నూలు జిల్లాలో ఒక మహిళ కుమారుణ్ని హత్య చేసింది. ఆ మహిళ అనారోగ్యంతో చనిపోతే మృతదేహాన్ని ఊళ్లోకి తీసుకురావడానికి గ్రామస్థులే అంగీకరించలేదు. వైకాపా నాయకులు మాత్రం ఆ ఘటనపై అక్కడ సమావేశాలు పెడుతూ, నానా యాగీ చేస్తున్నారు. అలాంటి రాజకీయ నాయకుల్ని ఎప్పుడూ చూడలేదు' అని మండిపడ్డారు. కర్నూలు జిల్లాలో బంగారం ఉత్పత్తి కర్మాగారం ఏర్పాటు చేస్తున్న జొన్నగిరి పేరు స్వర్ణగిరిగా మార్చాలని నిర్ణయించారు.

**'గీతం'పై చర్చ నుంచి బయటకు వెళ్లిన చంద్రబాబు, లోకేశ్**

విశాఖపట్నంలోని గీతం విద్యా సంస్థలో 45 మీటర్ల ఎత్తు స్కూల్ భవనం నిర్మాణానికి అగ్నిమాపకశాఖ ఎన్వోసీ అంశం చర్చకు వచ్చినప్పుడు చంద్రబాబు, లోకేశ్ బయటకు వెళ్లిపోయారు. అది తమ బంధువు, ఎంపీ భరత్‌కు చెందినది కావడంతో వారు బయటకు వెళ్లిపోయారు. మరో 20 నిమిషాల్లో సమావేశం ముగుస్తుందనగా, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సీఎం అనుమతి తీసుకుని వెళ్లిపోయారు.

# ఉక్రెయిన్‌లోకి భారత్ దళాలు.. వాన్స్ ప్రతిపాదనను కొట్టేసిన ట్రంప్

యుద్ధం ముగింపునకు ఓ ముసాయిదా ప్రణాళికను సమర్పించారు. యుద్ధ క్షేత్రంలో విదేశీ సైనిక దళాలను ఉపయోగించి కాల్పుల విరమణను పర్యవేక్షించే ఏర్పాట్లు చేయాలని ప్రతిపాదించారు. ఫ్రాన్స్, బ్రిటన్, నెదర్లాండ్స్ వంటి ఐరోపా దేశాల నుంచి శాంతి పరిరక్షణ దళాలను పంపించే ప్రణాళికను పేర్కొన్నారు.అయితే, దానికి ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ అభ్యంతరం తెలిపారు. నాటో సభ్య దేశాలకు చెందిన సైనిక బలగాలను ఉక్రెయిన్‌లోకి పంపితే.. అది రష్యా ను రెచ్చగొట్టినట్లే అవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. దానివల్ల ఉద్రిక్తతలు మరింత పెరగడంతో పాటు.. అమెరికా ప్రత్యక్షంగా యుద్ధంలో పాల్గొనాల్సిన పరిస్థితి తలెత్తుందని అంచనా వేశారు. ఈ క్రమంలోనే ప్రత్యామ్నాయ మార్గాలను ఆలోచించిన వాన్స్.. ఐరోపాయేతర దేశాల బలగాలను పంపించొచ్చని పేర్కొన్నారు. భారత్, సౌదీ అరేబియా దేశాల పేర్లను ఆయన ప్రతిపాదించారు.

కాగా.. వాన్స్ ప్రతిపాదనలను అధ్యక్షుడు ట్రంప్ తోసిపుచ్చినట్లు ఆ పుస్తకంలో పేర్కొన్నారు. "భారత ప్రధాని మోదీతో నాకు బలమైన అనుబంధం ఉంది. ఆయన నన్ను ఎంతగానో ఇష్టపడతారు. కానీ, భారత్ ఎప్పటికీ దీనికి అంగీకరించదు. ఇలాంటి విషయాల్లో జోక్యం చేసుకుని మూల్యం చెల్లించుకోవాలని అనుకోదు" అని నాడు ట్రంప్ అన్నట్లు తాజా పుస్తకంలో వివరించారు. ఈ సందర్భంగా ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తీరును కూడా ట్రంప్ తీవ్రంగా వ్యతిరేకించారట. ఆయనో అసమర్థ నేత అని, అమెరికా నుంచి నిధులు పొందుతూ కూడా.. సొంత దేశాన్ని నాశనం చేసుకుంటున్నారని నాడు జెలెన్‌స్కీపై మండిపడినట్లు తెలిసింది.

# కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు



## మార్టూరు జెడ్పీ హైస్కూల్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేస్తాం

## పది నిమిషాల్లో రూ.30 లక్షల విరాళాలు

## అసిస్ట్ సహకారంతో టాయిలెట్లు, ఇండోర్ గేమ్స్ రూమ్ ప్రారంభం

## కిచెన్ కం డైనింగ్ హాల్ ఏర్పాటుకు దాతలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామస్థుల ముందడుగు

## ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

(షణ్ముఖ వెలుగు, మార్టూరు, జూన్ 24)

కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దడమే లక్ష్యమని, మార్టూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తెలిపారు. విద్యార్థుల సౌలభ్యం కల్పించడం తన కర్తవ్యమని పేర్కొంటూ పాఠశాల అభివృద్ధికి మరిన్ని చర్యలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. బుధవారం మార్టూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో అసిస్ట్ సంస్థ సహకారంతో నూతనంగా నిర్మించిన మరుగుదొడ్లు, ఇండోర్ గేమ్స్ రూమ్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆర్డీవో హరికుమార్, అసిస్ట్ సంస్థ డైరెక్టర్ విష్ణుప్రియ, మండల విద్యాశాఖాధికారి (ఎంఈఓ) వస్త్రం నాయక్, మండల రెవెన్యూ అధికారి (ఎమ్మార్వో) ప్రశాంతిలను శాలువాలతో ఘనంగా సత్కరించి, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి అందిస్తున్న సేవలను అభినందించారు. విద్యార్థులకు మెరుగైన భోజన సౌకర్యాలు కల్పించేందుకు పాఠశాలలో కిచెన్ కం డైనింగ్ హాల్ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ నిర్మాణానికి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామస్థులు ఆర్థిక సహకారం అందించేందుకు ముందుకు రావడంతో పాటు ఎమ్మెల్యే ఏలూరి చొరవతో గ్రానైట్ అసోసియేషన్ భారీ విరాళాన్ని ప్రకటించినట్లు చెప్పారు. పాఠశాల అభివృద్ధికి ఎమ్మెల్యే చేసిన విజ్ఞప్తికి విశేష స్పందన లభించి కేవలం పది నిమిషాల వ్యవధిలోనే దాతలు రూ.30 లక్షలకు పైగా విరాళాలను ప్రకటించడం విశేషంగా నిలిచింది. అసిస్ట్ సంస్థ సహకారంతో పాఠశాలలో మరో తాగునీటి శుద్ధి ప్లాంట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు విద్యా ఫలితాల్లో ప్రథమ స్థానంలో నిలవాలని, హాజరు శాతాన్ని మరింత పెంచేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న నాణ్యమైన విద్య, మౌలిక వసతులు, విద్యార్థుల ప్రతిభను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో మరింత విశ్వాసం పెంచేందుకు చేపట్టే ప్రచార కార్యక్రమాల్లో తాను కూడా పాల్గొంటానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధులు, దాతలు, స్వచ్ఛంద సంస్థలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామస్థులు సమష్టిగా కృషి చేస్తే ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ విద్యాసంస్థలకు ఏమాత్రం తీసిపోని స్థాయికి చేరుకుంటాయని ఎమ్మెల్యే ఏలూరి పేర్కొన్నారు.






ప్రకాశం | మార్కాపురం | బాపట్ల

షణ్ముఖ
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు | తెలుగు దినపత్రిక

25.06.26 గురువారం


# ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల దోపిడీ




**అందినకాడికి దండుకుంటున్న వైనం**
**అర్హత లేని ఉపాధ్యాయులతో బోధన**
**పర్మిషన్లు, ఆట స్థలాలు లేకుండానే పాఠశాలలు నిర్వహణ**
**25 శాతం సీట్ల రిజర్వ్ గాలికి**
**ఒక్కో విద్యార్థి నుంచి 5 వేల నుండి 10 వేల వరకు అక్రమ వసూళ్ళు**
**ఇంగ్లీషు మిడియం విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్ క్లాసులకు ఫీజు వసూలు**

**(షణ్ముఖ వెలుగు, పర్చూరు ఇన్‌ఛార్జి, జూన్ 24)**

విద్యార్థుల భవిష్యత్తును తీర్చి దిద్దాల్సిన ప్రవేటు విద్యాసంస్థలు నేడు వ్యాపార నిలయాలుగా మారుతున్నాయి. కనీస నిబంధనలు పాటించకుండానే అడ్మిషన్ల పేరిట దోపిడీకి తెరలేపాయి. విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ లోపించడంతో సామాన్య మధ్యతరగతి తల్లిదండ్రుల జేబులకు చిల్లు పడుతోంది. చిన్నగంజాం మండలంలోని అన్ని ప్రైవేట్ స్కూళ్లలోనూ ఇదే పరిస్థితి. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులు అమలు చేయకుండా ఇష్టానుసారంగా ఒక్కో విద్యార్థి నుంచి 5 వేల నుండి 10వేల వరకు అక్రమంగా వసూల చేస్తున్నా యాజమాన్యాలను అధికారులు పట్టించుకోవడం లేదని తల్లిదండ్రుల మండిపాడుతున్నారు

**నిబంధనలకు పాతర**

వ్యాపార దృక్పథంతో గత రెండు సంవత్సరాల నుండి కోత్త పాఠశాలలు ప్రారంభమవుతున్నా, వాటికి సరైన ప్రభుత్వ గుర్తింపు ఉందా లేదా అన్నది ప్రశ్నార్ధకంగా మారింది. గత కోన్ని రోజుల క్రితం నూతన విద్యా సంవత్సరం ప్రారంభం అయిన నేపథ్యంలో, ఇరుకు గదుల్లో కనీస సౌకర్యాలు లేని భవనాల్లోనూ ఆకర్షణీయమైన ప్రచారాలతో అడ్మిషన్లు స్వీకరిస్తున్నారు. పాఠశాలను స్థాపించాలి అంటే ముందు విద్యాశాఖ నిబంధనల ప్రకారం నిర్ణీత రుసుం చెల్లించి అనుమతులు పొందాలి. చిన్నగంజాం మండలంలోని కొన్ని పాఠశాలలకు అసలు అనుమతులే లేవనీ తల్లిదండ్రులు వాపోతున్నారు.ప్రభుత్వ నిబంధనలు ప్రకారం గ్రామాల్లో 2000 చదరపు మీటర్ల ఆటస్థలం ఉండాలి. అగ్నిమాపక శాఖ అనుమతి తప్పనిసరిగా ఉండాలి. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు వేర్వేరు మరుగుదొడ్లు,పంచాయతీ మరియు భవన అనుమతులు ఉండాలి. క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా రేకుల షేడ్లు, ఇరుకు గదులు దర్శినం ఇస్తున్నాయి.ప్రస్తుతం 40డిగ్రీల భానుడి ఎండకు చిన్నారులు రేకుల షేడ్‌లో అవస్థలు పడుతున్నారు. రెండు పాఠశాలలకు కనీస ఆటస్థలం కూడా లేదు. కొత్తపాలెం పంచాయతీలో పాఠశాలకు పంచాయతీ, ఇతర అనుమతులు లేకుండానే క్లాసులు నడపటం విశేషం. అయినా విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**శిక్షణ లేని బోధన.. ఫీజుల బాదుడు!**

ప్రైవేట్ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని తల్లిదండ్రులు భావిస్తుంటే, యాజమాన్యాలు మాత్రం తక్కువ జీతాలకే లభించే అనర్హులైన వారిని ఉపాధ్యాయులుగా నియమిస్తున్నాయి. ప్రాథమిక స్థాయికి డీఈడీ, ఉన్నత తరగతులకు బీఈడీ అర్హత ఉండాలన్న నిబంధన ఉన్నా, కేవలం పది ఇంటర్, డిగ్రీ చదివిన వారితోనే పాఠాలు చెప్పిస్తున్నారు.

మరోవైపు ఫీజుల వసూళ్లకు అడ్డు అదుపు లేకుండా పోతోంది. సదరు పాఠశాలల్లో ఎల్‌కేజీ సీటుకే అన్ని కలుపుకుని రూ.20 వేల నుంచి వసూలు చేస్తుండటం గమనార్హం.అరువ తరగతి నుంచే ఐఐటి క్లాసులకు వేలల్లో ఫీజులు వసూలు చేస్తూన్న ముడుపుల మాటున మండల,జిల్లా అధికారులు మౌనం వహిస్తున్నరనే ఊహాగానాలు వినబడుతున్నాయి. ఇక ఫీజులు నియంత్రణ అంశాలు పరిశీలిస్తే ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్య నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్ ఆదేశాలను బేఖాతరు చేస్తున్నా ఏ ఒక్కరూ అటుగా ప్రశ్నించకపోవడం అందర్నీ అయోమయానికి గురిచేస్తుందనే చెప్పాలి.

**25 శాతం రిజర్వ్ సీట్లు సైతం గాలికి....**

రైట్ టు ఎడ్యుకేషన్ యాక్ట్2009 అనేది భారతదేశంలో పిల్లలకు ఉచిత, నిర్బంధ విద్యను అందించే చట్టంగా ప్రవేశపెట్టారు. 6 నుంచి 14 సంవత్సరాల వయస్సు గల ప్రతి బిడ్డకు తన నివాస స్థలానికి సమీపంలో ఉన్న ప్రైవేట్ పాఠశాలలో విద్యను అభ్యసించే హక్కు ఉంది. ఈ పద్ధతిలో ప్రైవేట్ పాఠశాలలు బలహీన వర్గాల పిల్లలకు 25 శాతం సీట్లను రిజర్వ్ చేయాలి. కాని మండలంలో ఏ ప్రవేటు స్కూల్ నందు సదరు నిబంధన కనిపించదు. ప్రతి ఒక్క తల్లిదండ్రులకు తెలిసేలా చేయాల్సిన మండల విద్యాధికారులు ప్రవేటు స్కూల్ యాజమాన్యంకి వత్తాసు పలుకుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు అరోపిస్తున్నారు.

**విద్యాశాఖ అధికారుల మౌనం పై విమర్శలు...**

ప్రవేటు పాఠశాలలు ఇంత దోపిడీ చేస్తున్న అధికారులు తనిఖీలు చేపట్టకపోవడం వెనుక ఆంతర్యమేమిటని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవల్సిన విద్యాశాఖ సిబ్బంది సంబంధిత పాఠశాలలకు వత్తాసు పలకడంతో విద్యా వ్యవస్థ దిక్కుతోచని స్థితిలో ఉందని స్పష్టంగా అర్థం అవుతుంది. ఇకనైనా ప్రైవేట్ స్కూళ్ల దోపిడీ పై విద్యాశాఖ స్పందించి చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రుల డిమాండ్ చేస్తున్నారు. మరి ఆ దిశగా అధికారులు అడుగులు వేస్తారో లేదో వేచి చూడాల్సిందే మరి....!

# అంతర్ రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

**రూ.8 లక్షల విలువ చేసే వాహనాలు, నగదు స్వాధీనం**




**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 24)**

మోటార్ సైకిల్, కార్ దొంగతనాలు చేసే నలుగురు అంతర్ రాష్ట్ర దొంగల ముఠాను అరెస్టు చేసినట్లు తాలుకా సిఐ టి విజయకృష్ణ తెలిపారు. బుధవారం తాలుకా సర్కిల్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన కేసు వివరాలు వెల్లడించారు. నగరంలోని బలరాం కాలనీ శివారులో తాళం పగలగొట్టి ఇంటిలోకి ప్రవేశించి ఐ 10 కారును దొంగిలించిన ఘటన 20వ తేదీ రాత్రి జరిగింది. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తాలుకా పోలీసులు కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. ఈ కేసును ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ప్రకాశం జిల్లా ఎస్పీ హర్ష వర్ధన్‌రాజు స్వీయ పర్యవేక్షణలో ఒంగోలు డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నేరం జరిగిన తీరుని బట్టి నేరస్థలంలో సేకరించి ఆధారాలను బట్టి లోతైన దర్యాప్తునకు తగిన మార్గదర్శకాలు, సలహాలు, సూచనలు చేయగా ఒంగోలు తాలుకా సీఐ విజయకృష్ణ, ఒంగోలు 1 టౌన్ సీఐ వెంకటేశ్వరరావు, తన సిబ్బందితో ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసుకొని, పేర్నమిట్ట సమీపంలో మిల్క్ డైరీ వద్ద రోడ్‌లో వాహనాలు తనిఖీ చేస్తుండగా ఏపీ 27 సీజీ 0691 నెంబర్ గల సిల్వర్ కలర్ ఐ10 కారు వేగంగా చీమకుర్తి వైపు నుండి ఒంగోలు వైపుకు వచ్చి పోలీసు వారిని తప్పించుకొనుటకు ప్రయత్నించగా కారును ఆపి సిఐ విచారించి సదరు కారు ఇటీవల తాలూకా పీఎస్ పరిధిలో దొంగిలించబడిన కారుగా గుర్తించడం జరిగిందన్నారు. కారులోని నలుగురు వ్యక్తులను ఎంఎస్‌సీడీ సహాయంతో తనిఖీ చేయగా ఆ నలుగురు షేక్ మదర్, కట్ట వాసుదేవ్, షేక్ బాజీ, సత్తెనపల్లి రాకేష్‌లను బుధవారం సాయంత్రం పేర్నమిట్ట వద్ద అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు. వారిని విచారించగా వారు నేరచరిత్ర కలిగిన అంతర్రాష్ట్ర దొంగలుగా నిర్ధారించుకుని వారి మీద పలుస్టేషన్‌లలో ఎన్నో కేసులు ఉన్నవని, వారి మీద సస్పెక్ట్ షీట్లు, రౌడీ షీట్లు ఉన్నట్టుగా నిర్ధారించుకొని వారిని సమగ్రంగా విచారించి వారి వద్ద నుండి కారుతో పాటు నేతాజీ నగర్, పొన్నూరులో దొంగిలించిన ఒక హోండా షైన్ మోటార్ సైకిల్, ఒక బుల్లెట్ మోటార్ సైకిల్, టంగుటూరు రావూరు సోమయ్య నగర్ నందు దొంగిలించిన బజాజ్ పల్సర్ మోటార్ సైకిల్, సింగరాయకొండ సుందర్ నగర్ నందు దొంగిలించిన గ్లామర్ మోటార్ సైకిల్, ఒంగోలు బస్టాండ్ వద్దన దొంగిలించిన వివో మొబైల్ ఫోన్, రూ.50వేలు నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కేసులో నిందితులను పట్టుకోవడంలో అత్యంత ప్రతిభ కనపరిచిన ఒంగోలు తాలుకా సీఐ విజయ కృష్ణ, ఒంగోలు 1 టౌన్ సీఐ వెంకటేశ్వరరావు, వారితో పాటు తాలూకా ఎస్ఐ శ్రీనివాసరావు, హెడ్ కానిస్టేబుల్ అన్వర్ భాష, రామకృష్ణ, ఒంగోలు 1 టౌన్‌కు చెందిన ఏఎస్ఐ సురేష్, హెడ్ కానిస్టేబుల్ సాయి, విజయ్, పీసీ అనిల్, టెక్నికల్ అసిస్టెంట్ వెంకట్‌లను జిల్లా ఎస్పీ పత్యేకంగా అభినందించారు.

# 'జలధార – జలహారతి'

## కార్యక్రమం క్రింద చేపట్టిన పనులను త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలి

## జిల్లా కలెక్టర్ పి రాజాబాబు

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జూన్ 24)**



'జలధార–జలహారతి' కార్యక్రమం క్రింద చేపట్టిన పనులను త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు అధికారులను ఆదేశించారు. బుధవారం సిసిఎల్ఏ అధికారిణి జయలక్ష్మి అమరావతి సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రభుత్వ సేవల పట్ల ప్రజల్లో సానుకూల అభిప్రాయం, రీ సర్వే, పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీలో పురోగతి, జలధార–జల హారతి, తదితర అంశాల పై ఆమె సమీక్షించారు. క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్ ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. అనంతరం ఆయా అంశాల పై సంబంధిత అధికారులతో కలెక్టర్ ప్రత్యేకంగా చర్చించారు. జలధార–జల హారతి పనులను త్వరగా పూర్తి చేయడంపై దృష్టి సారించాలని ఆదేశించారు. పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీకి ఈ–కేవైసీ నమోదులో వేగం పెంచాలని చెప్పారు. డ్వామా పిడి జోసఫ్ కుమార్, భూ సేకరణ, గ్రీవెన్స్ విభాగ బాధ్యులు కూడా ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.




# స్థానిక సంస్థల ఎన్నికలలో అన్ని సీట్లు మనమే గెలవాలి

**ప్రతి కార్యకర్త సర్ పై ప్రత్యేక దృష్టి సారించాలి**
**పనిచేసే వారికి తగిన ప్రాధాన్యత టిడిపిలోనే**
**టిడిపి విస్తృతస్థాయి సమావేశంలో టిడిపి ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షులు, కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి**




**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జూన్ 24)**

రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో జిల్లాలోని అన్ని స్థాయిలలో పార్టీ విజయకేతనం ఎగరవేయాలని టిడిపి ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షులు, కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపు ఇచ్చారు. ఒంగోలులోని టిడిపి పార్లమెంటు కార్యాలయంలో టిడిపి విస్తృతస్థాయి కార్యకర్తల, నాయకుల సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఉగ్ర మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో ప్రతి ఓటును కాపాడుకోవాల్సిన బాధ్యత కార్యకర్త పై ఉందన్నారు. సర్ ఫారాలను, ఫోటోలను ఎక్కడ మిస్ కాకుండా కార్యకర్తలు ప్రతి ఓటును కాపాడుకోవాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలలో ప్రతి ఓటు ఎంతో ప్రాధాన్యతతో కూడుకుందన్నారు. (తరువాయి 4లో...)



# దోర్నాలలో ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ విజయ సునీత, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, జూన్ 24)**

ఈ నెల 27వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెలిగొండ ప్రాజెక్టు ఫీడర్ కాలువ పనుల పురోగతిని పరిశీలించడంతో పాటు, వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు పరిహారం పంపిణీ కార్యక్రమంలో పాల్గొననున్న నేపథ్యంలో గంటావానిపల్లిలో చేపట్టిన ఏర్పాట్లు, భద్రతా చర్యలను జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత, ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు పరిశీలించి, సభా ప్రాంగణ ఏర్పాట్ల పై సమీక్ష నిర్వహించారు. హెలిప్యాడ్ ప్రాంతం, వీఐపీల వాహనాల రాకపోకలు, పార్కింగ్ ప్రాంతం, పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించి, అక్కడ ఏర్పాట్లను సమీక్షించారు. ఇంకా చేపట్టాల్సిన ప్రత్యేక చర్యలపై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఎలాంటి భద్రతా లోపాలు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పర్యటనకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను సమగ్రంగా పరిశీలించి, అవసరమైన చర్యలను చేపట్టాలని జిల్లా ఎస్పీ పోలీస్ అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా భద్రతా ఏర్పాట్లలో భాగంగా మొత్తం 400 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో పటిష్ఠమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం జాయింట్ కలెక్టర్ పి శ్రీనివాసులు, (తరువాయి 4లో...)

# స్థానిక సంస్థల ఎన్నికలలో అన్ని సీట్లు మనమే గెలవాలి







మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు...

టిడిపి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వైసీపీ వాళ్లు టిడిపి వాళ్లను టార్గెట్ చేస్తూ రాష్ట్రానికి ఇదేమి కర్మ, బాదుడే బాదుడు, వంటి కార్యక్రమాలతో పాటు సూపర్ సిక్స్ పై కూడా అనేక విమర్శలు చేశారన్నారు. అయితే కార్యకర్తలు పార్టీ తమ పని తాము సజావుగా చేసుకోవడం ద్వారా విజయవంతమైన ఫలితాలను రాబట్టగలిగామన్నారు. పార్టీ ఆదేశాలను తూచా తప్పకుండా పాటించడం ద్వారా పార్టీ మరింత అభివృద్ధి చెందుతుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. నాయకులు గ్రామాలలోకి పోయి పెత్తనం చేయవద్దని, మిగిలిన కార్యకర్తలతో కలిసి పని చేయాలని, అప్పుడే మంచి ఫలితాలు రాబట్టవచ్చన్నారు. పార్టీలో పనిచేసే వారికి తప్పకుండా తగిన ఆదరణ ఉంటుందన్నారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ రావు మాట్లాడుతూ రాష్ట్రాన్ని రూ. 10 లక్షల కోట్ల అప్పుతో జగన్ ప్రభుత్వం ముంచి వెళ్లిందన్నారు. నెల నెల వడ్డీలకి లక్షల కోట్లు కట్టాల్సి వస్తుందన్నారు. ముఖ్యమంత్రి ఉండటం వల్ల రాష్ట్రంలో ప్రతి నెల ఒకటో తేదీన పింఛన్లు, ఉద్యోగులకు జీతాలు పడుతున్నాయన్నాడు. అన్నదాత సుఖీభవ వంటి పథకాలు సక్రమంగా అమలవుతున్నాయి అన్నారు. మూతపడ్డ అన్న క్యాంటీన్లు తెరిచి ప్రతి పేదవాడికి రూ.5 రూపాయలకే కడుపు నిండా అన్నం పెడుతున్నారు. గతంలోలా పని చేసే కార్యకర్తకి ఎటువంటి రికమండేషన్లు అవసరం లేదని, సోషల్ మీడియా విపరీతంగా పెరిగిపోయిన నేపథ్యంలో క్షేత్రస్థాయిలో ఎవరు బాగా పనిచేస్తున్నారు అధినాయకత్వానికి తెలుస్తుంది అన్నారు. అందువల్ల పనిచేసే ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందన్నారు. పార్టీ బలోపేతానికి, సంస్థాగత నిర్మాణానికి, సభ్యత విస్తరణకు, ప్రజా సమస్యలపై పోరాటానికి క్షేత్రస్థాయి నుండి ప్రతి కార్యకర్త పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, దర్శి నియోజకవర్గం టిడిపి ఇన్చార్జ్ గొట్టిపాటి లక్ష్మి, ఒంగోలు పార్లమెంట్ టిడిపి ప్రధాన కార్యదర్శి కొఠారి నాగేశ్వరరావు. ఈ కార్యక్రమంలో ఒంగోలు పార్లమెంట్ కమిటీ ఉపాధ్యక్షులు, షేక్ ఆరీఫా, గెనం సుబ్బారావు, గొర్రెపాటి రామయ్య చౌదరి, చీకటి వెంకటసుబ్బయ్య, కాట్రాజు నాగరాజు, అధికార ప్రతినిధులు దాసరి వెంకటేశ్వర్లు, బీరం అరుణ రెడ్డి, షేక్ షాహిద్, ఎంబడి ఈశ్వరమ్మ, ఏరువ సంజీవ ప్రసాద్ రెడ్డి, కార్యాలయ కార్యదర్శి షేక్ షరీఫ్, కార్యనిర్వాహక కార్యదర్శి కసుకుర్తి అంకరాజు, వల్లెపు వెంకటనారాయణ, గార్లపాటి శ్రీనివాసరావు, చేరెడ్డి నర్సారెడ్డి, నాగిశెట్టి చిన్నమ్మ మాలకొండయ్య, కార్యదర్శులు నర్రా సైలుషా, పటాన్ సుభాని, తంజావూరి శ్రీనివాసమూర్తి, తాతపూడి ఎస్జె కుమార్, మీడియా కోఆర్డినేటర్ పాటిబండ్ల రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలు టౌన్ పార్టీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బండారు మదన్, బోడపాటి వెంకట్, ఒంగోలు రూరల్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శి గుండపనేని శ్రీనివాసులు, గద్దె వెంకటకృష్ణ, కనిగిరి రూరల్ మండల పార్టీ అధ్యక్షులు కొండ కృష్ణయ్య, సి.ఎస్.పురం మండల పార్టీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శి బొబ్బూరి రమేష్, గుజ్జుల తిరుపతయ్య, హనుమంతునిపాడు మండల పార్టీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శి సానికొమ్ము తిరుపతిరెడ్డి, మురహరి నరసయ్య, పామూరు మండల పార్టీ అధ్యక్షులు బొల్లా వెంకటలక్ష్మి నరసింహారావు, దర్శి టౌన్ పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పుల్లలచెరువు సత్యనారాయణ, బత్తుల త్రిశంకర్ నాథ్, కురిచేడు మండల పార్టీ అధ్యక్షులు పిడతల నేమిలయ్య, ముండ్లమూరు మండల పార్టీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శి కూరపాటి శ్రీనివాసరావు, రావూరి సుధాకర్, దర్శి రూరల్ మండల పార్టీ అధ్యక్షులు మారెళ్ళ వెంకటేశ్వర్లు, తాళ్లూరు మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పిన్నిక రమేష్, మరిపూడి మండల పార్టీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శి గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మద్దూరి దాసు, టంగుటూరు మండల పార్టీ అధ్యక్షులు చదలవాడ చంద్రశేఖర్, తర్లుపాడు మండల పార్టీ అధ్యక్షులు ఉడుముల చిన్నపరెడ్డి, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# పాఠశాల అభివృద్ధి ప్రణాళికల పై సమీక్షా సమావేశం





(షణ్ముఖ వెలుగు, కంభం, జూన్ 24)

పాఠశాలల సమగ్ర అభివృద్ధి, విద్యా ప్రమాణాల పెంపు, మౌలిక సదుపాయాల విస్తరణ లక్ష్యంగా బుధవారం స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖాధికారి పత్తి శ్రీనివాసులు మాట్లాడుతూ పాఠశాలలు అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు పాఠశాలల్లో తరగతి గదులు, త్రాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యాలు, డిజిటల్ విద్యా వనరులు తదితర మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థుల హాజరు శాతం పెంపు, అభ్యసన ఫలితాల అభివృద్ధి, పరిశుభ్రత నిర్వహణ, పచ్చదనం, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలను ప్రణాళికల్లో చేర్చాలని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా సంస్కరణలు, మన బడి మన భవిష్యత్తు,విద్యా కార్యక్రమాల నిర్వహణ, పాఠశాల భద్రతా ప్రమాణాల అమలు తదితర అంశాలపై చర్చించారు. మండలంలోని అన్ని పాఠశాలలు ప్రాధాన్యత క్రమంలో అవసరాలను గుర్తించి, అందుకు తగిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించిన ఉపాధ్యాయులు జి ఎస్ మనోహర్‌రెడ్డి, పాఠశాల, ఆవాస ప్రాంత, క్లస్టర్, మండల అభివృద్ధి ప్రణాళికల రూపకల్పన పై సమగ్ర వివరణ అందించి, ప్రధానోపాధ్యాయులకు అవగాహన కలిగించారు. ఈ సమావేశంలో క్లస్టర్ ప్రధానోపాధ్యాయులు గని వెంకటేశ్వర్లు, అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సీఆర్పీలు, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# నేటి నుంచి మున్నంవారి పాలెంలో రాష్ట్ర స్థాయి బీచ్ కబడ్డీ పోటీలు

(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, జూన్ 24)

శ్రీ పోలేరమ్మ తల్లి అమ్మవారి 1వ వార్షికోత్సవం పురస్కరించుకొని చిన్నగంజాం మండలం మున్నంవారిపాలెంలో గురువారం నుండి శనివారం వరకు రాష్ట్రస్థాయి బీచ్ కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు కబడ్డీ నిర్వహక కమిటీ సభ్యులు తెలియాజేసారు. సదరు పోటీల్లో మొదటి బహుమతి రూ.30,116, రెండవ బహుమతి రూ.20,116, ముడవ బహుమతి రూ.14,116, నాల్గవ బహుమతి రూ.10,116, ఐదవ బహుమతి రూ.7,116, 6వ బహుమతి రూ.5,116, 7వ బహుమతి రూ.3,116 లుగా కలవని కమిటీ సభ్యులు తెలిపారు. వివరాలకు 7842334561, 9553686266, 9010906481 నంబర్‌లు సంప్రదించాలని కోరారు.

# దోర్నాలలో ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ విజయ సునీత, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు



యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు, మార్కాపురం డీఎస్పీ యు నాగరాజు, ఆర్డీఓ వెంకట శివరామిరెడ్డి, వెలిగొండ ప్రాజెక్టు ఎస్ఈ అబూ తలీం, డిఎల్డిఓ బాలు నాయక్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ ఎం శ్రీనివాసరావు, వై పాలెం ఇన్‌స్పెక్టర్ కె అజయ్ కుమార్, త్రిపురాంతకం సీఐ అసన్, తదితరులు పాల్గొన్నారు.





# విజన్ బిల్డింగ్ శిక్షణ కార్యక్రమం





(షణ్ముఖ వెలుగు, ఇంకొల్లు, జూన్ 24)

ఇంకొల్లు మండలం మండల సమాఖ్య వెలుగు కార్యాలయం నందు ఎపిఎమ్ అనురాధ అధ్వర్యంలో రెండు రోజులు విజన్ బిల్డింగ్ శిక్షణలో భాగంగా రెండవ రోజు వార్షిక ప్రణాళిక 2 పై గ్రామ సంఘాల ఆఫీస్ బేరర్స్‌కి రెండు రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో ముందుగా ఏపీఎం మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో గ్రామాల అభివృద్ధి కొరకు కేటాయించిన 8 అంశాలను( విద్య, ఆరోగ్యం, వ్యవసాయం, సామాజిక భద్రత,ఆస్తుల సృష్టి,పరివర్తన లో మార్పు,సుస్థిర జీవనోపాదులు,సామర్థ్యాల పెంపు) దృష్టిలో ఉంచుకొని మండలం యొక్క బడ్జెట్ వార్షిక ప్రణాళిక తయారు చేసుకొని ఆ అంశాలను అనుసరిస్తూ గ్రామాలను ఎలా అభివృద్ధి చేయాలనే ఒక ప్రణాళికను తయారు చేసుకుని గ్రామాలు అభివృద్ధి చెందడానికి బడ్జెట్ పై ఒక ప్రణాళికను సిద్ధం చేసుకోవడం జరిగిందని తెలిపారు. ఈ ప్రణాళికలో మండల బడ్జెట్ రూ.2 కోట్ల వరకు తయారు చేయడం జరిగింది. రాబోవు రోజుల్లో ప్రతి గ్రామ సంఘం పరిధిలో గ్రామం వారిగా ఈ 8 అంశాల పై ప్రణాళిక ను తయారు చేసుకొని గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం బి అనురాధ, సిసిలు, ఎంఎస్ కోశాధికారి సుభాషిణి, అకౌంటెంట్ కె సుబ్బులు, గ్రామ సంఘాల ఆఫీస్ బేరర్స్ పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు పోరాటం ఆగదు

## ఏఐటీయూసీ నేతలు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 24)




మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు పోరాటం ఆపేది లేదని ఏఐటీయూసీ నాయకులు యు.ప్రకాశరావు , ఎస్ డి సర్దార్‌లు అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఏఐటీయూసీ అనుబంధ ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ చేపడుతున్న జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద ధర్నా కార్యక్రమాలలో భాగంగా బుధవారం ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ప్రభాకర్ అధ్యక్షతన కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏఐటీయూసీ నాయకులు ప్రకాశరావు, సర్దార్, ఏఐటీయూసీ ఒంగోలు నగర కార్యదర్శి శ్రీరామ్ శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్ ల సాధనకై విడతల వారీగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని వారు తెలిపారు. ఈనెల 20 నుండి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కార దిశగా చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో పోరాటాలు ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. మున్సిపల్ కార్మికులపై రాజకీయ నాయకుల ఒత్తిడులు ఎక్కువవుతున్నాయని వాటిని తీవ్రంగా ఖండిస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకొని మున్సిపల్ కార్మికులపై రాజకీయ ఒత్తిడులు లేకుండా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఇటీవల తిరుపతిలో జరిగిన ఏఐటీయూసీ రాష్ట్ర మహాసభలలో కనీస వేతనం 36 వేల రూపాయలు ఇవ్వాలని తీర్మానం చేయడం జరిగిందని దానిని వెంటనే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఆప్కాస్ ను రద్దుచేసి కార్మికులను పర్మినెంట్ చేయాలని, మరణించిన మున్సిపల్ కార్మికులు స్థానంలో వారి కుటుంబ సభ్యులకు పనులు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ సెక్రటరీ యర్రంశెట్టి ఆనందమోహన్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు లేనిదే గ్రామాలు, పట్టణాలు లేవని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు సక్రమంగా పనిచేస్తేనే అది సాధ్యమవుతుందని అలాంటి మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాల్సిన అవసరం రాష్ట్ర ప్రభుత్వానికి ఎంతైనా ఉందని అన్నారు. ఏదైనా అనుకోని కరోనా లాంటి విపత్తు వచ్చినప్పుడు మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల అవసరం ఏమిటో తెలుస్తుందని అలాంటి వారిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంటుందని వారికి రావలసిన పిఎఫ్, ఈఎస్ఐ బకాయిలను వెంటనే చెల్లించి హెల్త్ కార్డులను సక్రమంగా వారు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. అనంతరం డిఆర్ఓకు తమ న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకుపోవాలని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకురాలు కాకుమాని రవణమ్మ, కత్తి విజయ్, ఆలూరి రమేష్, మయూరి, పులి నాగేశ్వరరావు, కేశవమ్మ, తదితరులు పాల్గొన్నారు.



# వ్యాపారుల చేతుల్లో కీలుబొమ్మగా మారిన చంద్రబాబు నాయుడు ప్రభుత్వం

## సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు

## పొగాకు కొనుగోళ్ల తీరుకు నిరసనగా ఒంగోలులో ప్రారంభమైన రిలే నిరాహార దీక్షలు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 24)

నెల రోజులుగా వర్జీనియా పొగాకు గిట్టుబాటు ధరల కోసం పొగాకు రైతులు పలు రూపాలలో నిరసనలు వ్యక్తం చేస్తూ, భారీ ఎత్తున నిరసన ట్రాక్టర్ ర్యాలీలు నిర్వహిస్తే, దిగొచ్చిన కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రులు క్వింటా పొగాకును రూ.20 వేలుకు తక్కువ కాకుండా కొనుగోలు చేస్తామని, నో బిడ్ లు లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చి వారం రోజులు గడుస్తున్నా, పొగాకు వ్యాపారులు మాత్రం ముఖ్యమంత్రి ఆదేశాలను బేఖాతరు చేస్తూ, రైతుల కష్టాన్ని దోచుకుంటున్నారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు రాష్ట్ర ప్రభుత్వం పై ధ్వజమెత్తారు. రాష్ట్రంలో పాలన సాగిస్తుంది కూటమి ప్రభుత్వము, లేక వ్యాపారుల కూటమా అని ప్రశ్నించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.1000 కోట్లు నిధులు కేటాయించి, ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా పొగాకును కొనుగోలు చేయించాలని, పొగాకు కొనుగోలు వ్యాపారుల మోసాలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఒంగోలులోని కలెక్టర్ కార్యాలయం వద్ద సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె వీరారెడ్డి, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు పమిడి వెంకటరావు, అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు మాట్లాడుతూ దేశ ఆర్థిక వ్యవస్థకు దన్నుగా ఉన్న పొగాకు రైతుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం క్వింటా పొగాకును సరాసరి న రూ. 25 వేలకు కొనుగోలు చేస్తేనే పొగాకు రైతులు కొంతమేర కోలుకుంటారని ఈ సందర్భంగా పేర్కొన్నారు. నెలరోజులుగా పొగాకు రైతులు ఆందోళన చేస్తున్నప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు రూ. వెయ్యి కోట్లు నిధులు కేటాయించి, ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా గిట్టుబాటు ధరలకు పొగాకును కొనుగోలు చేయించే అంతవరకు రిలేనిరాహార దీక్షలు కొనసాగుతాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వడ్డే హనుమాన్ రెడ్డి మాట్లాడుతూ కార్పొరేట్ కంపెనీలకు వేలకోట్ల రూపాయలు రాయితీల పేరుతో ఇస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల కోసం రూ. వెయ్యి కోట్లు నిధులు కేటాయించలేవా అని ప్రశ్నించారు. పెనాల్టీ ల పేరుతో రైతులకు సంబంధించిన నగదు పొగాకు బోర్డు వద్ద వందల కోట్ల నిధులు ఉన్నాయని, వాటిని రైతుల కోసం ఎందుకు ఉపయోగించటం లేదని ఈ సందర్భంగా ఆయన ప్రశ్నించారు. ఏపీ రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కే నాంచార్లు, ఎస్ లలిత కుమారి మాట్లాడుతూ పొగాకు కొనుగోలు వ్యాపారులంతా సిండికేట్ గా ఏర్పడి క్వింటాకు రూ. 16 నుండి 17000 వరకు ధర ఇస్తున్నారని, ఎక్కువగా బిడ్ ల పేరుతో పొగాకును తిరస్కరిస్తూ, పొగాకు రైతులను మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనివల్ల రైతుకు బ్యార్ని కి రూ. ఐదు నుండి 7 లక్షల వరకు నష్టం వాటిల్లుతుందని పేర్కొన్నారు. పొగాకు రైతులు అప్పుల ఊబి నుండి బయట పడాలంటే ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా పొగాకు నువ్వ కొనుగోలు చేయించాలని. అప్పటివరకు రిలే నిరాహార దీక్షను ఆగవని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రైతుల రిలే నిరాహార దీక్షలకు పలు ప్రజా సంఘాలు మద్దతు ఇచ్చాయి. ఈ కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు, రైతు కూలీ సంఘాల నాయకులు సిఎస్ సాగర్, అబ్బూరి వెంకటేశ్వర్లు, బెజవాడ శ్రీనివాసులు, టి. శ్రీకాంత్, జి వెంకట్రావు, ఆర్ మోహన్, పద్మ, తదితరులు పాల్గొన్నారు.











# ప్రభుత్వం పెండింగ్ సమస్యలను పరిష్కరించాలి

### 2003 డీఎస్సీ ఉపాధ్యాయులను పాత పెన్షన్ విధానంలోకి మార్చిన ప్రభుత్వానికి ధన్యవాదాలు

### బహుజన టీచర్స్ అసోసియేషన్

(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జూన్ 24)

బహుజన టీచర్స్ అసోసియేషన్ ఉలవపాడు మండల శాఖ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బుధవారం విజయవంతంగా నిర్వహించింది. ఈ కార్యక్రమంలో బిటిఏ రాష్ట్ర జిల్లా మండల నాయకులు పాల్గొన్నారు ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షులు మేడికొండ భాస్కర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వెంటనే 12వ పిఆర్సి నియమించి 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించి, పెండింగ్లో ఉన్న డిఏ లను వెంటనే ప్రకటించాలని కోరారు. మండల అధ్యక్షులు తున్నేపల్లి శ్రీను మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల పోరాటాన్ని మన్నించి 2003 డిఎస్సి ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేసిన ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు దార్ల కోటేశ్వరరావుతో పాటు సుదర్శి ప్రభాకర్, ఎలి చర్ల కోటేశ్వరరావు, పున్నెపల్లి గోపి, దాసరి బాలయ్య, ధన్నాసి కొండలరావు, దావులూరి భాను ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు. మండలంలోని ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో సభ్యులుగా చేరి బహుజన టీచర్స్ అసోసియేషన్ ను ఆదరించినందుకు ఉపాధ్యాయులకు ఉలవపాడు బిటి మండల శాఖ జనరల్ సెక్రెటరీ దన్నాసి మురళి మోహన్, ధన్యవాదాలు తెలియజేశారు.






# పేదింటి ఆరోగ్యానికి సీఎంఆర్ఎఫ్ భరోసా

### ఎమ్మెల్యే ఏలూరి చేతుల మీదుగా 60 మందికి రూ.41.89 లక్షల చెక్కుల పంపిణీ

### పర్చూరు నియోజకవర్గంలో ఇప్పటివరకు 1,984 మందికి రూ.17.75 కోట్ల సాయం

### ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు వెల్లడి

(షణ్ముఖ వెలుగు, మార్టూరు, జూన్ 24)

పేద కుటుంబాలకు వైద్య ఖర్చుల భారం తగ్గించడంలో ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) కీలక భరోసాగా నిలుస్తోందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. బుధవారం ఆయన చేతుల మీదుగా నియోజకవర్గానికి చెందిన 60 మంది లబ్ధిదారులకు రూ.41,89,556 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రెక్కాడితే డొక్కాడని పేద కుటుంబాలు అత్యవసర వైద్యం చేయించుకునేందుకు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితుల్లో ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేదల ఆరోగ్య భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని, ఆయనకు పర్చూరు నియోజకవర్గ ప్రజలు రుణపడి ఉంటారని పేర్కొన్నారు. పర్చూరు నియోజకవర్గంలో ఇప్పటివరకు 1,984 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.17.75 కోట్ల మేర ఆర్థిక సాయం అందిందని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ప్రజలకు సీఎంఆర్ఎఫ్ సాయం అందడంలో తీవ్ర నిర్లక్ష్యం చోటుచేసుకుందని, వైద్య ఖర్చులు భరించలేక అనేక కుటుంబాలు అప్పులపాలై ఆర్థికంగా చితికిపోయాయని విమర్శించారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా సాయం అందిస్తున్నామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రజలకు అవసరమైన సమయంలో ప్రభుత్వం అండగా నిలవడమే తమ లక్ష్యమని చెప్పారు. సీఎంఆర్ఎఫ్ ద్వారా అందుతున్న ఆర్థిక సాయం పేద కుటుంబాలకు పెద్ద ఊరటనిస్తోందని లబ్ధిదారులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

# సాయి కృష్ణ కేసు లాగే క్రాంతి మాదిగ కేసులో కూడా సిఐ నాగరాజును అరెస్టు చేయాలి

## పెద్ద మాదిగను అంటున్న ముఖ్యమంత్రి పేరుపోగు క్రాంతి మాదిగ కుటుంబాన్ని పరామర్శించాలి

## క్రాంతి మాదిగ కుటుంబానికి రిలీఫ్ ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలి

## ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్‌ను కోరిన దళిత నేత నీలం నాగేంద్ర




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 24)

సాయి కృష్ణ కేసు లాగే క్రాంతి మాదిగ కేసులో కూడా సిఐ నాగరాజు అరెస్టు చేయాలని పెద్ద మాదిగను అని చెప్పుకుంటున్న ముఖ్యమంత్రి చంద్రబాబు పేరిపోగు క్రాంతి మాదిగ కుటుంబాన్ని పరామర్శించాలి దళిత కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేంద్రరావు డిమాండ్ చేశారు. బుధవారం విజయవాడలో కృష్ణలంక పోలీస్ స్టేషన్లో సర్కిల్ ఇన్స్పెక్టర్ నాగరాజు వేధింపులకు గురై పోలీస్ ప్రేరేపిత బలవన్ మరణానికి గురైన పేరు పోగు క్రాంతి కుటుంబాన్ని పరామర్శించడానికి వచ్చిన ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్ ముందు నీలం నాగేంద్రరావు కూటమి ప్రభుత్వ కుల వివక్షపై కాపులను కౌగిలించుకొని మాదిగలపట్ల అంటరానితనం పాటించటం మంచిది కాదన్నారు. క్రాంతి కుమార్ మాదిగ సెల్ఫీ వీడియో తీసుకొని తాను మాదిగ కులస్తుడును కావటం వలన సిఐ నాగరాజు మరి కొంతమంది పోలీస్ అధికారులు చిత్రహింసలు పెట్టారని చెప్పులు, బూట్లు పాలిష్ చేసుకొని బతికేవాడు అని అవమానించారని క్రాంతి మాదిగ తండ్రి ఎమ్మార్పీఎస్ నాయకుడు పేరు పోగు వెంకటేశ్వరరావు ఫిర్యాదు చేశాడు. కానీ విజయవాడ పోలీసులు ఇంతవరకు కేసు నమోదు చేయలేదన్నారు. కాపు కులానికి చెందిన సాయి కృష్ణ శవం కనిపించకపోయినా హత్య కేసు కట్టి పోలీసులు అరెస్టు చేసి నెల్లూరు జైలుకు పంపించారన్నారు. నిజాయితీపరుడైన ఖాకీ నాగరాజును అరెస్టు చేయొద్దు అంటూ జనసేన మహిళలు గగ్గోలు పెట్టిన విజయవాడ పోలీసులు రాష్ట్రంలో లాకప్ డెత్ చేసి శవాన్ని మాయం చేసి బూడిద కూడా లేకుండా చేసిన కిరాతక నాగరాజు చేతులకు సంకెళ్లు వేసి చెరసాలకు పంపించడం హర్షనీయమన్నారు. కానీ కూటమి ప్రభుత్వ గెలుపు కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు మరలా పాలన సాగించాలని కష్టపడి ప్రచారం చేసిన ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు పేరు పోగు వెంకటేశ్వరరావు కుమారుడు క్రాంతి పోలీస్ వేధింపులకు బలయితే పెద్ద మాదిగను అని ప్రకటించుకున్న చంద్రబాబు కనీసం ఫోన్ కూడా చేయలేదన్నారు. రాష్ట్ర హోం మంత్రి మాదిగ సామాజిక వర్గానికి చెందిన వంగలపూడి అనితను ఇటీవల వైసిపి మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ మేకప్ మంత్రి అంటూ అనుచిత వ్యాఖ్యలు చేస్తే సంబంధిత హోం మంత్రి నియోజకవర్గం అయినా పాయకరావుపేటలో కూడా కేసు నమోదు కాలేదు అన్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో రాష్ట్ర పోలీస్ శాఖకు అధిపతి అయిన హోం మంత్రిని అవమానిస్తేనే కూటమి పోలీస్ లు కేసు కట్టలేదు అని గత్యంతరం లేని పరిస్థితుల్లో ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్ హోం మంత్రిని అవమానించిన వారిపై కేసు కట్టాలని ఆదేశించి కేసు కట్టించడం కూటమి ప్రభుత్వంలో ఎస్సీ ఎస్టీల రాజ్యాంగ హక్కుల రక్షణకు నిదర్శనం అన్నారు. కావున తాము సోమవారం విజయవాడ నగర పోలీస్ కమిషనర్ను రాజశేఖర్ బాబును కలిసి క్రాంతి మాదిగ బలవన్మరణం పై ఫిర్యాదు చేయగా ఉత్తర డిసిపి సత్యానందుకు కేసును అప్పగించామణి ఎస్సీ ఎస్టీ కేసుగా మారుస్తామని హామీ ఇచ్చామన్నారు. కానీ రెండు రోజులైనా బలవన్మరణం దీనీ 108 ఎస్సీ ఎస్టీ ఆక్ట్ ఎందుకు వేయలేదని ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్ ను నీలం నాగేంద్రరావు ప్రశ్నించారు. కృష్ణలంక సీఐ నాగరాజును అరెస్టు చేసే పనిలో పోలీసులు అందరూ బిజీగా ఉన్నారని తాను పోలీస్ కమిషనర్ తో మాట్లాడి చట్టప్రకారం దళిత నాయకుల డిమాండ్ మేరకు సెక్షన్లు ఇస్తామని ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్ నీలం నాగేంద్రరావు హామీ ఇచ్చారు. క్రాంతి కుమార్ మాదిగ కుటుంబానికి రిలీఫ్, ప్రభుత్వ ఉద్యోగం, వ్యవసాయ భూమి ఐదు ఎకరాలు కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎస్సీ కమిషన్ చైర్మన్ డిమాండ్ చేశారు. మాల మహానాడు జిల్లా అధ్యక్షులు దారా అంజయ్య మాట్లాడుతూ ప్రకాశం జిల్లా దారకానిపాడు లో కాపు యువకుడిని కమ్మ కులస్తులు కారుతో గుద్ది హత్య చేస్తే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కాపు కుటుంబానికి కోటి రూపాయలు వ్యవసాయ భూమి ఇచ్చినట్లే క్రాంతి మాదిగ కుటుంబానికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా కార్యదర్శి కాకుమాను రవి,మాదిగ పరిరక్షణ సమితి నాయకులు పత్రా బంగారం, బొమ్మల వంశీ, మాల చైతన్య వేదిక కన్వీనర్ రంజిత్, దేవరపల్లి గోపి తదితరులు ఉన్నారు.



## సిపిఐ మండల కార్యదర్శి కామ్రేడ్ జీపీ రామారావు మృతి





(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, జూన్ 24)

కమ్యూనిస్టు పార్టీ (సీపిఐ) మండల పార్టీ కార్యదర్శి గొర్రెముచ్చు రామారావు బుధవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. పార్టీ శ్రేణుల వివరాల ప్రకారం కనిగిరి నుండి పెదచేర్లోపల్లి మండలం వెంగలాయపల్లె వద్ద ఆటో బోల్తా పడటంతో తీవ్ర గాయాలైన రామారావు ను కనిగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించేలోపు మృతి చెందినట్లు తెలిపారు. సీపీఐ పార్టీలో మండల కార్యదర్శిగా పనిచేస్తూ ప్రజా ఉద్యమాల్లో చురుకైన పాత్ర పోషించిన ఆయన ప్రజల, కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం జీవితాంతం పోరాడారు. నిబద్ధత కలిగిన నాయకుడిగా, ఉద్యమకారుడిగా ఆయన సేవలు చిరస్మరణీయాలు. ఆయన మరణం ప్రజా ఉద్యమాలకు, సీపీఐ పార్టీకి తీరని లోటు. సిపిఐ నాయకులు ఏనుబరి రవి, సయ్యద్ యాసిన్ అన్నారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి, సంతాపం తెలియచేశారు. ఈ విషాద సమయంలో వారికి మనోధైర్యం చేకూరాలని ఆకాంక్షించారు. మండలంలో పలువురు నాయకులు మృత దేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

## ఎస్ఐఆర్ కార్యక్రమంలో కో కన్వీనర్ షేక్ ఖాజావలి



(షణ్ముఖ వెలుగు, కంభం, జూన్ 24)

కంభం మండలం అరఫత్ నగర్‌లో జరుగుతున్న ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమంలో బూత్ (40)కో-కన్వీనర్ షేక్ ఖాజావలి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీఆర్వో దాదాపీరాతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలించారు. అర్హులైన ఓటర్లు తమ వివరాలను సక్రమంగా నమోదు చేసుకోవాలని, ఓటరు జాబితాలో ఎలాంటి పొరపాట్లు ఉంటే వెంటనే సరిచేసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ఓటరు జాబితా పారదర్శకంగా, ఖచ్చితంగా ఉండేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు ఉత్సాహంగా పాల్గొని తమ వివరాలను నమోదు చేయించుకున్నారు. ఎస్ఐఆర్ కార్యక్రమం విజయవంతం కావడానికి అధికారులు, సిబ్బంది, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తున్నారు.

## అంతర్జాతీయ ఒలంపిక్ రోజు సందర్భంగా మొక్కలు నాటిన రఫీ, రసూల్



(షణ్ముఖ వెలుగు, కంభం, జూన్ 24)

మండలంలోని లింగోజిపల్లె గ్రామంలో అంతర్జాతీయ ఒలంపిక్ డే రోజున శుభాకాంక్షలు తెలుపుతూ సయ్యద్ రఫీ, రసూల్ లు మొక్కలు నాటారు. ప్రధాని మోదీ చే ప్రశంసలు అందుకున్న ప్రకృతి ప్రేమికుడు కె ఎన్ రాజశేఖర్ శరీర ఆరోగ్యానికి మానసిక ఆరోగ్యానికి పోటీ తత్వాన్ని ఎదుర్కోవటానికి ఆటలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. బుధవారం అంతర్జాతీయ ఒలంపిక్ డే కి శుభాకాంక్షలు తెలుపుతూ లింగోజిపల్లి గ్రామంలో మొక్క నాటిన గ్రీన్ స్పోర్ట్స్ మాన్ ఆఫ్ ఇండియా సయ్యద్ రఫీ, లెక్చరర్ సయ్యద్ రసూల్ ని అభినందించారు. గత 6 సంవత్సరముల నుండి ప్రతిరోజు క్రమం తప్పకుండా మొక్కలు నాటుతూ 114వ మన్ కీ బాత్ కార్యక్రమంలో భారత ప్రధాని నరేంద్ర మోడీ చే ప్రశంసలు అందుకున్న కెఎన్ రాజశేఖర్, తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ ఇంగ్లీష్ టీచర్ పబ్లిక్ మీడియా బాలు అభినందనలు తెలిపారు. ఇటువంటి ప్రత్యేక దినోత్సవాల్లో మొక్కలు నాటి నందుకు వీరికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరు కూడా వీరిని ఆదర్శంగా తీసుకొని మొక్కలు నాటాలన్నారు.

## మధురం మధురాతిమధురం వినోద్ కుమార్ గానం

### నేత్ర పర్వంగా ఊంజల్ సేవ

### అన్నమయ్య సంకీర్తనల ఆలాపనతో భక్తులను అలరించిన వివిఎస్ వినోద్ కుమార్

### గానంతో ప్రతిభ చాటిన యువ గాయకుడు ఆలూరు శ్రీ నీరజ్

### శ్రీగిరి గోవింద నామాలు సిడి ఆవిష్కరణ





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 24)

ఒంగోలులోని కుర్తాళం శ్రీ సిద్దేశ్వరీ పీఠ పాలిత శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి త్రయాహ్నిక బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధ వారం సాయంత్రం ఆలయ అర్చకులు వేద పండితులు శ్రీవారికి ఊంజల సేవను నేత్ర పర్వంగా శోభాయమానంగా నిర్వహించారు. ఉభయ దేవేరులతో కొలువు తీరిన శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని భక్తులు తనివితీరా దర్శించి పులకిత గాత్రులయ్యారు. ప్రముఖ గాయకులు శ్రీగిరి దేవస్థానం ఆస్థాన సంగీత విద్వాంసులు వివిఎస్ వినోద్ కుమార్ పద కవితా పితామహుడు తాళ్ళపాక అన్నమాచార్యులు విరచిత సంకీర్తనలను శ్రీగిరి వెంకట రమణుని పై ప్రత్యేకంగా రూపొందించిన శ్రీగిరి గోవింద నామాలను మృదు మధురంగా ఆలపించి భక్తులను అలరించారు. శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి, ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు సుశీలా దేవి, శ్రీగిరి దేవస్థానం ఉత్తర అమెరికా ప్రతినిధి డాక్టర్ ఆలూరు శ్రీనివాస చరణ రాజీవ్ కార్య నిర్వహణ ధర్మకర్త సి వి రామకృష్ణారావు, ధర్మకర్తల మండలి ప్రతినిధులు ఆలూరు వెంకటేశ్వర రావు, ఆలూరు లక్ష్మీ కుమారి, ఆలూరు జై శంకర్, ఆలూరు కుమార ఆత్రేయ తదితరులు వివిఎస్ వినోద్ కుమార్‌ను ఘనంగా సత్కరించారు. యువ గాయకుడు ఆలూరు శ్రీ నీరజ్ (అమెరికా) "ముద్దుగారే యశోదా, వేడుకుందామా" వంటి అన్నమయ్య విరచిత సంకీర్తనలను హృద్యంగా ఆలపించి నేటి యువతకు స్ఫూర్తిదాయకంగా నిలిచాడు. శ్రీ నీరజ్‌ను, శ్రీ నీరజ్ తల్లిదండ్రులు డాక్టర్ ఆలూరు శ్రీనివాస చరణ రాజీవ్ శ్రీలత దంపతులను పలువురు అభినందించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు శ్రీవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

## వ్యాపార లావాదేవీల్లో పారదర్శకత కోసమే ఈ-పర్మిట్ విధానం

### ఏఎంసీ చైర్మన్ సుప్రజ, సెక్రటరీ మురళి






(షణ్ముఖ వెలుగు, బద్వేల్, జూన్ 24)

ుబద్వేలు పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) కార్యాలయంలో బుధవారం ఈ-పర్మిట్ విధానంపై వ్యాపారులకు, రైస్ మిల్లర్లకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ (అధ్యక్షులు) ఎన్. సుప్రజ, కార్యదర్శి ఎం. మురళిల ఆధ్వర్యంలో ఉదయం 11:00 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన మాస్టర్ ట్రైనీ జి. ఎస్పాల్ పాల్గొని ఈ-పర్మిట్ విధానంపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు.ఆన్‌లైన్ ద్వారా ఈ-పర్మిట్లను ఎలా జనరేట్ చేయాలి, సాంకేతిక ఇబ్బందులను ఎలా అధిగమించాలి అనే అంశాలను ఆయన డిజిటల్ పద్ధతిలో క్షుణ్ణంగా వివరించారు.

#### పారదర్శకత కోసమే నూతన విధానం

ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ అధ్యక్షులు ఎన్ సుప్రజ, కార్యదర్శి ఎం మురళి మాట్లాడుతూ వ్యాపార లావాదేవీల్లో పారదర్శకతను పెంచేందుకు మరియు ప్రక్రియను మరింత సులభతరం చేసేందుకు ఈ-పర్మిట్ విధానం ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. ట్రేడర్లు, రైస్ మిల్లర్లు ఈ నూతన సాంకేతికతపై పూర్తి అవగాహన పెంచుకుని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ-పర్మిట్ విధానాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ సిబ్బందితో పాటు స్థానిక రైస్ మిల్లర్లు, ట్రేడర్లు, వివిధ సంస్థల అకౌంటెంట్లు పెద్ద సంఖ్యలో పాల్గొని తమకున్న సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

# పశ్చిమ ప్రాంతంలో కనులవిందైన పండుగ మొహర్రం

**కోరిన వరాలిచ్చే హజరత్ కాసిం స్వాముల మహిమ గొప్పది**
**కోర్కెలు తీరిన వారు మొక్కులు తీర్చుకొని**
**తలనీలాలు ఇవ్వడం అనవాయితీ**









**(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, జూన్ 24)**

మండలంలోని తుమ్మలచెరువు గ్రామంలో వెలసియున్న అత్యధిక మహిమ గల హజరత్, ఖాసీం స్వాముల మొహర్రం పండుగ వేడుకలు అత్యంత వైభవోపేతంగా గ్రామంలోని అన్నివర్గాల ప్రజలు ఘనంగా నిర్వహిస్తారు. ఈ గ్రామంలో నిర్వహించే మొహర్రం వేడుకలు పశ్చిమ ప్రాంత ప్రజలందరికి అనగా అన్ని కులాలకు, మతాలకు అతీతంగా కనుల విందుగా ఐకమత్యంగా జరుపుకునే పండుగ, ఎందుకనగా ఈ ఖాసిం స్వాములను దర్శించుకునే భక్తులు వారి మనసులోని కోరికలను, అనగా సంతానం లేని వారు, వ్యాపారం, ఆరోగ్యం, భూత, పిశాచాల నుండి విముక్తి, దీర్ఘకాలాల నుండి అనేక సమస్యలతో సతమతమవుతున్న వారి జటిలమైన సమస్యలను, కుటుంబ పరమైన, తదితర అన్ని సమస్యలను తీర్చడంలో ఈ స్వాముల మహిమ అత్యద్భుతం. కావున భక్తులు మనస్ఫూర్తిగా కోరికలు కోరుకుంటారు. దీంతో మహిమ గలిగిన ఆ స్వాముల వేడుకలను తిలకించేందుకు సుదూర ప్రాంతాల నుండి భక్తులు, రాజకీయనాయకులైన మంత్రులు, ఎమ్మెల్యేలు, వ్యాపారవేత్తలు, సంతానం కలిగిన వారు, కోరికలు నెరవేరిన వారందరూ వాహనాలలో కుటుంబ సమేతంగా అత్యధిక సంఖ్యలో పాల్గొని తలనీలాలు, అన్నదానాలు, దర్గా అభివృద్ధికి ఆర్థిక సహకారాలు చేసి ఖాసీం స్వాములకు మొక్కులు భక్తిశ్రద్ధలతో తీర్చుకుంటారు. ఈ సందర్భంగా దర్గా కమిటీ నిర్వాహకులు, గ్రామ పెద్దలు దర్గాను అంగరంగ వైభవంగా మిరిమిట్లు గొలిపే విద్యుత్ కాంతులతో శోభాయమానంగా తీర్చిదిద్దుతారు. ముందుగా ఈ మొహర్రం వేడుకలు నెల పొడుపును చూసి పెట్టెలు భద్రపరిచిన కాసిం స్వామి పేర్లను క్రిందకు దించి దర్గాలో నెలకొల్పుతారు. అనంతరం సాంప్రదాయబద్ధంగా ఈ నెల 22వ తేదీన చిన్న సరిగత్తు నిర్వహించారు. 25వ తేదీన పెద్దసరిగెత్తు బ్రహ్మాండంగా నిర్వహిస్తారు. 26న గ్రామశివారులలో గల ఈద్గా వద్ద పీర్లను జల్దిలో కలుపుతారు. అనంతరం తిరుగు ప్రయాణంలో భక్తులందరూ అల్లాను కొలుచుకుంటూ స్థానిక చావీడీలలో గల పెట్టెలో ఖాసీం స్వాముల పీర్లను భద్రపరుస్తారు. అంతే కాక ఈ వేడుకలను తిలకించేందుకు వచ్చిన భక్తులకు అన్ని రకాల మౌలిక సదుపాయాలను కలుగజేయడమే కాక వివిధ రకాల వినోద కార్యక్రమాలను ఏర్పాటు చేస్తారు. ఇక్కడ మొహర్రం వేడుకలు అత్యంత ప్రతిష్టాత్మకంగా, అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. ఈ వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు మండల ఎస్ఐ బ్రహ్మానాయుడు ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తారు.

---

## ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగం

**రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్‌గా కొండపల్లి దేవి నియామకం**



**(షణ్ముఖ వెలుగు, బద్వేల్, జూన్ 24)**

ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగంలో సరికొత్త ఉత్తేజం నెలకొంది. బద్వేల్ పట్టణానికి చెందిన ప్రముఖ సామాజిక కార్యకర్త, ఆర్యవైశ్య నాయకురాలు కొండపల్లి దేవి ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగం రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్‌గా ప్రతిష్ఠాత్మకంగా నియమితులయ్యారు. ఈ మేరకు మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు కొప్పురావూరి రజని అధికారిక నియామక పత్రాన్ని అందజేసి, రాష్ట్ర కమిటీ తరపున ఆమెకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన వైస్ ప్రెసిడెంట్ కొండపల్లి దేవి మాట్లాడుతూ గత అనేక సంవత్సరాలుగా సమాజంలో ఆర్యవైశ్య మహిళల అభ్యున్నతికి, సంక్షేమానికి మేము అందిస్తున్న సేవలను గుర్తించి, మరోసారి రాష్ట్రస్థాయిలో ఇంతటి బాధ్యతాయుతమైన పదవిని కేటాయించినందుకు రాష్ట్ర అధ్యక్షురాలు కొప్పురావూరి రజని గారికి మరియు పెద్దలందరికీ నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామన్నారు, భవిష్యత్తులో ఆర్యవైశ్య సోదర సోదరీమణులకు ఏ కష్టం వచ్చినా మా వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా అందుబాటులో ఉంటాయి. ఈ ప్రాంతంలో నెలకొన్న ఆర్యవైశ్యుల సమస్యలను ఎప్పటికప్పుడు రాష్ట్రస్థాయి కమిటీ దృష్టికి తీసుకెళ్లి, వాటి శాశ్వత పరిష్కారానికి నా శాయశక్తులా కృషి చేస్తాను అని హర్షం వ్యక్తం చేశారు.

**ప్రముఖుల ఘన అభినందనలు :**

కొండపల్లి దేవి రాష్ట్రస్థాయి వైస్ ప్రెసిడెంట్‌గా నియమితులవడం పట్ల బద్వేల్ నియోజకవర్గంతో పాటు కడప జిల్లావ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు, వివిధ సంఘాల నాయకులు ఆమెను కలిసి ఘనంగా అభినందనలు తెలిపారు. జిల్లా రూరల్ అధ్యక్షులు వల్లంకొండు వెంకటరమణ, గౌరవ అధ్యక్షులు పి.వి.ఎ.న్. ప్రసాద్, కె.వి. సుబ్బారావు, సెక్రటరీ సి.వి. నాగేశ్వరరావు, ట్రెజరర్ పబ్బతి చంద్రశేఖర్. ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులు కొండపల్లి చిన్న సుబ్బారావు, సెక్రెటరీ ఉరిమి శ్రీనివాసులు, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ కొలిశెట్టి నాగరాజా, ఆవోప అధ్యక్షులు నూకల రెడ్డయ్య, పలువురు ప్రముఖ వ్యాపారస్తులు, బద్వేల్ ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలు దేవతి లలిత, మాజీ అధ్యక్షురాలు చింతకుంట ధనమ్మ, సభ్యులు కొండపల్లి దేవి కి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

## కడప జిల్లా ఆర్యవైశ్య సంఘం (రూరల్) సెక్రెటరీగా సివి నాగేశ్వరరావు, కోశాధికారిగా పబ్బతి చంద్రశేఖర్ నియామకం

**శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో నియామక పత్రాల అందజేత**
**పేద వైశ్యుల అభ్యున్నతికి, సమస్యల పరిష్కారానికి శాయశక్తులా కృషి చేస్తాం**
**నూతన పదాధికారులు**







**(షణ్ముఖ వెలుగు, బద్వేల్, జూన్ 24)**

కడప జిల్లా ఆర్యవైశ్య సంఘం (రూరల్) నూతన సెక్రెటరీగా సివి నాగేశ్వరరావు, కోశాధికారిగా పబ్బతి చంద్రశేఖర్ నియమితులయ్యారు. బుధవారం పట్టణంలోని సిద్ధవటం రోడ్డులో గల శ్రీ వెంకటేశ్వర స్వామి, అభయాంజనేయ స్వామి దేవాలయంలో వీరికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో కడప జిల్లా ఆర్యవైశ్య సంఘం (రూరల్) అధ్యక్షులు వల్లంకొండు వెంకటరమణ, గౌరవ అధ్యక్షులు కే.వి. సుబ్బారావు చేతుల మీదుగా నూతన పదాధికారులకు నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ నియామక పత్రాలు అందుకున్న సివి నాగేశ్వరరావు, పబ్బతి చంద్రశేఖర్ మాట్లాడుతూ తమపై నమ్మకంతో ఈ బాధ్యతలను అప్పగించినందుకు జిల్లా కమిటీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలోని ఆర్యవైశ్యులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి నిరంతరం శ్రమిస్తాం. ముఖ్యంగా నిరుపేద వైశ్యులకు చేయూతనందించి, వారి అభ్యున్నతికి తోడ్పడటమే మా ప్రధాన లక్ష్యం. ఈ ఆశయ సాధనలో జిల్లా అధ్యక్షులతో కలిసి, మా శక్తివంచన లేకుండా ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సేవలందిస్తామని వారు స్పష్టం చేశారు. నియామక కార్యక్రమం అనంతరం ఆలయ వేద పండితులు వీరేశ చార్యులు నూతన పదాధికారులకు వేదమంత్రాలతో ఆశీర్వచనాలు పలికి, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ ప్రముఖులు, పలువురు సంఘ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతనంగా ఎన్నికైన సెక్రెటరీ, కోశాధికారులకు ఘనంగా శుభాకాంక్షలు తెలియజేశారు.

## మండలంలో రైతన్న మీకోసం కార్యక్రమం





**(షణ్ముఖ వెలుగు, పొదిలి, జూన్ 24)**

మండలంలో రైతన్న మీకోసం కార్యక్రమము నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా మండల వ్యవసాయ అధికారి దేవిరెడ్డి శ్రీనివాసులు మల్లవరం, సూదనగుంట రైతు సేవ కేంద్రాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రతి రైతు మార్కెట్‌లో ఏ పంట ఉత్పత్తికి డిమాండ్ ఉంటుందో ఆ పంటను పండించి మంచి లాభాలు గడించాలని, ఆహారపు అలవాట్లు అనుగుణంగా అన్నదాతలు సాగు పద్ధతులు మార్చుకోవాలి, పంటలు మార్పిడి పాటించాలని చిరు దాన్యాలు అయిన రాగులు జొన్నలు, సజ్జలు, కొర్రలు వంటి వాడికి మళ్ళీ డిమాండ్ వచ్చిందని చిరుధాన్యాలు సాగు మరింత పెంచాలని ఆయన రైతులను కోరారు. నీటి భద్రతలో భాగంగా సాగునీటి వనరులు, భూగర్భ జలాలను అత్యంత పొదుపుగా వాడుకొని ఖర్చు తగ్గించాలని ఉత్పత్తి పెంచే నాణ్యమైన ఉత్పత్తులతో రైతులకు ఆదాయాన్ని పెంచడమే లక్ష్యంగా సాగు చేయాలని రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో భాగంగా అన్ని రైతు సేవ కేంద్రాల వ్యవసాయ సహాయకులు, ఉద్యానవన సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

## భవిత పాఠశాలకు మైక్ సెట్ ప్రధానం చేసిన కసిరెడ్డి వెంగళరెడ్డి





**(షణ్ముఖ వెలుగు, పొదిలి, జూన్ 24)**

పొదిలిలోని భవిత స్కూల్ పిల్లలకు డిప్యూటీ డిఈఓ మామిళ్లపల్లి శ్రీనివాసులరెడ్డి చేతుల మీదుగా మైక్ సెట్ ను అందించి చక్కని భోజనం ఏర్పాటు చేశారు దాతలు. బుధవారం పొదిలిలోని ఎంఆర్‌సి పక్కన ఉన్న భవిత స్కూల్ మానసిక వికలాంగ పిల్లలకు, ఇటీవల మెగా డీఎస్సీలో స్కూల్ అసిస్టెంట్ (టీచర్ పోస్ట్) గ్రూప్ 2కి కూడా ఎంపిక అయిన శుభ సందర్భంలో, కసిరెడ్డి వెంగళరెడ్డి, కృష్ణవేణి దంపతులు ఈ ధాతృత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్బంగా స్కూలు పిల్లలకు డొనేట్ చేసిన మైక్ సెట్, భోజనంను మార్కాపురం డిప్యూటీ డీఈఓ ఎం శ్రీనివాసులురెడ్డి, నాగలక్ష్మి, బీవి రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు పి రమణారెడ్డి, సుబ్బారెడ్డి, ఇతర ఎమ్మార్సీ స్టాఫ్, టీచర్స్ పాల్గొన్నారు.

# శ్రీగిరి పై విద్యుత్ దీపాలంకరణలో శ్రీవారి శంఖు చక్రాలు తిరునామం ఏర్పాటు

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 24)**

సమస్త విశ్వానికి బ్రహ్మాండ గోళాలకు సకల జీవరాశికి అధిపతియైన శ్రీ మహావిష్ణువు కలియుగంలో శ్రీ వెంకటేశ్వర స్వామి వారిగా తిరుమల గిరిపై వెలసి తన భక్తులను అనుక్షణం అనుగ్రహిస్తున్నాడు. శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ప్రత్యక్ష ఆదేశాన్ని అనుసరించి ఆలూరు వెంకట రమణారావు ఒంగోలులోని శ్రీగిరిపై శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి అద్భుతమైన ఆలయాన్ని నిర్మించి తరించారు. శ్రీగిరి దేవస్థానం వ్యవస్థాపక ధర్మకర్త ఆలూరు వెంకట రమణారావు ఆశయాలను మరింత ఫలవంతం చేసే లక్ష్యంలో భాగంగా శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి శ్రీగిరి దేవస్థానం చెంతనే ఉన్న శ్రీగిరి గో శాల భవనం పై భాగంలో శ్రీవారి శంఖు చక్రాలతో పాటు శ్రీవారి తిరు నామాన్ని ఒక్కొక్కటి 15 అడుగుల ఎత్తైన వాటిని నిపుణుల చేత ప్రత్యేకంగా తయారు చేయించి బుధవారం సాయంత్రం ఆవిష్కరించారు. ప్రత్యేక లైటింగ్ ఏర్పాటు వల్ల రాత్రి సమయంలో కొన్ని కిలోమీటర్ల దూరంలో ఉన్న వారికి సైతం స్పష్టంగా శ్రీవారి శంఖు చక్రాలు తిరునామం కనిపిస్తాయి. శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి ప్రతినిధులు శ్రీవారి శంఖు చక్రాలను తిరునామాన్ని భక్తులు దర్శించుకునే విధంగా ప్రత్యేకంగా తయారు చేయించి ఏర్పాటు చేయడం పట్ల భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. శ్రీగిరి ధర్మకర్తల మండలికి వారు ప్రత్యేకంగా అభినందనలు తెలియజేస్తున్నారు.



శ్రీగిరి దేవస్థానం విశిష్టతను మరింత చాటి చెబుతాం:

శ్రీగిరి దేవస్థానం వ్యవస్థాపక ధర్మకర్త ఆలూరు వెంకట రమణారావు ఆశయాలను మరింత ముందుకు తీసుకువెళ్లే లక్ష్యంతో పలు విశిష్ట కార్యక్రమాలను కుర్తాళం శ్రీ సిద్దేశ్వరి పీఠ



పాలిత శ్రీ గిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చేపడుతున్నది. ఇప్పటికే శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీ గిరి దేవస్థానంలో శ్రీవారికి గరుత్మంతునికి మధ్య భాగంలో మహా మండపం సీలింగ్ పై వితాన అష్టదిక్పాలక పరివృత వటపత్ర శాయి కళా కృతిని ఆవిష్కరించాము. బుధవారం శ్రీవారి శంఖు చక్రాలను తిరునామాన్ని భక్తులు కొన్ని కిలోమీటర్ల దూరం నుంచి విద్యుత్ దీపాల వెలుగులో దర్శించి తరించే అవకాశాన్ని కల్పించడం జరిగింది. భవిష్యత్తులో మరిన్ని ప్రత్యేక కార్యక్రమాలను భక్తుల సహకారంతో చేపట్టేందుకు శ్రీ గిరి దేవస్థానం ధర్మకర్తల మండలి కృషి చేస్తుంది.



# భక్తి శ్రద్ధల నడుమ వెంకటేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ

## మార్టూరు దేవాలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ఏలూరి భారీగా తరలివచ్చిన భక్తజనం

**(షణ్ముఖ వెలుగు, మార్టూరు, జూన్ 24)**

మార్టూరు బలరాం కాలనీలో శ్రీ వెంకటేశ్వర స్వామివారి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం బుధవారం భక్తి శ్రద్ధల నడుమ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య జరిగిన ప్రతిష్ఠా కార్యక్రమంలో ఎమ్మెల్యే ఏలూరి పాల్గొని పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం ఆలయ అభివృద్ధి, ప్రాంత ప్రజల సుఖసంతోషాలు, రాష్ట్రాభివృద్ధి కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యత, సాంప్రదాయ విలువలను పెంపొందిస్తాయని అన్నారు. దేవాలయాలు కేవలం ఆరాధనా కేంద్రాలు మాత్రమే కాకుండా ప్రజలను ధర్మమార్గంలో నడిపించే ఆధ్యాత్మిక క్షేత్రాలని పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవానికి మార్టూరుతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణం



భక్తులతో కిక్కిరిసిపోయి ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# మండల కాపునాడు కమిటీ ఎన్నిక




**(షణ్ముఖ వెలుగు, పొదిలి, జూన్ 24)**

పొదిలి మండలయువ కాపునాడు అధ్యక్షుడిగా మలిశెట్టి సందీప్, మండల ప్రధాన కార్యదర్శిగా దాసరి మల్లేశ్వరరావు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షులు పోగుల మల్లికార్జున రావు, పార్లమెంట్ జనరల్ సెక్రటరీ దాసరి పిచ్చయ్య నాయుడు, కాపునాడు రాష్ట్ర ఉపాధ్యక్షులు పెద్దిశెట్టి నరసింహ రాయల్, మార్కాపురం జిల్లా కన్వీనర్ వెలుగోలు కాశీ విశ్వనాథ్, పొదిలి మండల కాపునాడు అధ్యక్షుడు వీరిశెట్టి సురేష్, పొదిలి టౌన్ అధ్యక్షుడు ముని శ్రీను, కాపునాడు మండల ఉపాధ్యక్షుడు చాతరాజు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# పలు శుభకార్యాలకు హాజరైన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు





**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జూన్ 24)**

కందుకూరు నియోజకవర్గంలో బుధవారం పలువురు నాయకులు, కార్యకర్తల ఇళ్లలో జరిగిన శుభకార్యాలకు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు హాజరయ్యారు. కందుకూరు పట్టణంలోని కళ్యాణ మండపంలో విక్కిరాలపేట గ్రామానికి చెందిన గంగవరపు వెంకటరావు కుమార్తె లక్ష్మీప్రియ, సృజన్ తేజ వివాహ వేడుకలో పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించారు. లింగసముద్రం మండలం వెంగళాపురంలో లోమడ వీరాంజనేయులు, వెంకట చామంతి వివాహం సందర్భంగా వారికి ఆశీర్వచనాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వలేటివారిపాలెం మండలం బండివారిపాలెంలో బండి మాధవరావు కుమార్తె మనీషా వివాహం సందర్భంగా నలుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. పెండ్లి కుమార్తెను ఆశీర్వదించారు. కందుకూరు మండలం కొల్లగుంట గ్రామంలో బైరపునేని కోటయ్య గృహప్రవేశ కార్యక్రమానికి హాజరయ్యారు. వలేటివారిపాలెం మండల టిడిపి అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం, పలువురు గ్రామ నాయకులు వేడుకల్లో పాల్గొన్నారు.

# ఉర్దూ పాఠశాల ఆక్రమణని కాపాడాలి

## ముస్లిం హక్కుల వేదిక నాయకుల వినతి




**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 24)**

ఒంగోలు నగరం నడిబొడ్డున ఉన్న కోటా వీధి ఉర్దూ పాఠశాల ఆక్రమణని కాపాడాలని ప్రభుత్వం స్పందించి పాఠశాల యొక్క పూర్వపు గుర్తింపును తీసుకొని ఒంగోలులో ఉన్న ముస్లిమ్స్‌ని పిల్లలకు ఉర్దూ భాషని దూరం చేయకుండా పాఠశాల నిర్మాణం ప్రభుత్వమే చేపట్టాలని ముస్లిం హక్కుల వేదిక నాయకులు మహమ్మద్ రఫీ డిమాండ్ చేశారు. బుధవారం ఒంగోలు సుందరయ్య భవనంలో సిపిఎం నాయకులను కలిసి సమస్యను వివరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి మాబు, కార్యదర్శివర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు, పార్టీ నాయకులు పుల్లారావు, కాలం సుబ్బారావు, అమీర్ పాల్గొన్నారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com